# సంపాదకీయం

## 'భరోసా' భయాలు..!

భారత్ తన ఇంధన భద్రత గురించి భయపడనక్కరలేదు, ఎంత చమురు కొనాలనుకుంటే అంతా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం అంటూ అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రూబియో చేసిన వ్యాఖ్యలో, భరోసా కంటే బెదిరింపే ఎక్కువగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. రెండుదేశాల మధ్యా ఇంధన సహకారమే తన పర్యటనలో అత్యంత కీలకాంశమని ఆయన ముందే చెప్పివచ్చారు. తాము అమెరికా రికార్డుస్థాయిలో చమురు ఉత్పత్తి, ఎగుమతులు చేస్తున్నదని గుర్తుచేయడంతోపాటు, భారతదేశ ఇంధన దిగుమతుల్లో సింహభాగం తమదే కావాలని కూడా స్పష్టంచేశారు. తమతోపాటు, వెనెజువెలాకు కూడా అధికవాటా దక్కాలని కోరడమే కాక, ఆ దేశాధ్యక్షురాలు భారత్‌లో పర్యటించబోతున్న తరుణంలో, ఉభయదేశాలూ కలసి ముందుకు సాగాలన్నారు. డెల్సీ రోడ్రిగ్స్ పర్యటనను అటు వెనెజువెలా కానీ, ఇటు భారతదేశం కానీ ప్రకటించకుండా రూబియో నిర్ణయించడమేమిటని ప్రశ్నించిన కాంగ్రెస్, గత ఏడాది మే 10వతేదీ సాయంత్రం ఐదున్నరగంటలకు ఆపరేషన్ సిందూర్ నిలిపివేసినట్టుగా భారతప్రభుత్వం కంటే ముందు ఈయనే చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. భారతదేశానికి సంబంధించిన కీలక నిర్ణయాలు ముందుగా అమెరికాలో జరుగుతున్నాయా? అని కాంగ్రెస్ ప్రశ్న.చమురు లోటు తీవ్రంగా ఎదుర్కొంటున్న భారతదేశం తన దిగుమతుల జాబితాలో అమెరికా, వెనెజువెలాలను ప్రథమస్థానాల్లో నిలుపుకొని భారీగా కొనుగోళ్ళు జరపాలన్నది రూబియో మాటల సారాంశం. తాము ఆరంభించిన ఇరాన్ యుద్ధంతో భారత్‌లో ఏర్పడిన చమురు సంక్షోభాన్ని ఎలా పరిష్కరించుకోవాలో అమెరికాయే చెబుతోంది. వెనెజువెలా చమురుమీద ఆంక్షలతో భారత్‌ను గతంలో బెదిరించి, దిగుమతులకు మోకాలడ్డిన అమెరికా, ఇప్పుడు తానే స్వయంగా సేల్స్‌మ్యాన్ పాత్ర పోషిస్తోంది. జనవరిలో ఒక అర్ధరాత్రి కుట్రలో నికోలస్ మదురోను ఎత్తుకుపోయి, ఆ స్థానంలో నమ్మినబంటును ప్రతిష్ఠించుకున్నాక, వెనెజువెలా చమురును అమెరికన్ కంపెనీలే 'డ్రిల్ బేబీ డ్రిల్' అని ఆడుతూ పాడుతూ తవ్వుకుంటున్నాయి, అమ్ముకుంటున్నాయి. అప్పటివరకూ ఈ పాపిష్ఠి చమురుమీద ఉన్న ఆంక్షలన్నీ ఒక్కసారిగా తొలగి, పెత్తనం అమెరికా చేతిలోకి పోయింది. పేరుకు మరోదేశమైనా సర్వాధికారం అమెరికాదే కనుక, ఆ కంపెనీల, వాటి లాభాల పరిరక్షణ ప్రధానం. ఇప్పటికే అమెరికా ఆంక్షలు, హెచ్చరికల దెబ్బకు రష్యా చమురు వెనుకపట్టుపట్టి మన దిగుమతుల్లో వెనెజువెలా ముందుకు వచ్చింది. మొన్నటివరకూ ఒక్కచుక్కా కొనుగోలుచేయని వెనెజువెలానుంచి రెండునెలలుగా భారీ దిగుమతులు సాగుతున్నాయి. రష్యానుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు రెట్టింపు సుంకాలతో మనను శిక్షించిన అమెరికా, ఆ తరువాత తాను ఆరంభించిన ఇరాన్ యుద్ధం కారణంగా తానే రష్యానుంచి కొనుగోళ్ళకు అనుమతులు ఇచ్చి, ఈ నెలలో మళ్ళీ తలుపులు మూసివేసింది. రష్యా బదులు వెనెజువెలా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందని ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు చెప్పిన ప్రకారంగానే అంతా జరుగుతోంది. రూబియో మార్గనిర్దేశనం ప్రకారం నడుచుకుంటే రేపటిరోజుల్లో అమెరికా, వెనెజువెలాలే మన ఇంధనభద్రతను నిర్ణయిస్తాయి.ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారతదేశం ఇంధనం కోసం ఏటా రమారమి 175 బిలియన్ డాలర్ల ధనం ఖర్చుచేస్తున్నది. పెట్రోడాలర్ ఆధిపత్యానికి వివిధ దేశాలు, కూటములనుంచి సవాళ్ళు ఎదురవుతున్న నేపథ్యంలో, మిత్రదేశమైన భారత్‌ను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు కాస్తంత మిగులు కూడా ఉన్నందున, భారత ఇంధన సరఫరాలను తన నియంత్రణలోకి తీసుకోవాలని చూస్తోంది. ఘర్షణపడే ఉద్దేశం లేదని అంటూనే అమెరికా తాను చేయదల్చుకున్నది చేస్తోంది. ట్రంప్ విధానాలు కేవలం భారత్‌ను ఉద్దేశించినవి కావని అంటున్నప్పటికీ, ట్రంప్ మలిరాకడ తరువాత భారత్‌కు అన్నిరంగాల్లోనూ ఒనగూరిన నష్టం అపారమైనది. రష్యన్ చమురుమీద ఆంక్షలు, ప్రతీకార సుంకాలతో భారత ఎగుమతులను దెబ్బతీయడం, గ్రీన్ కార్డు, వీసా నియంత్రణలు, పాకిస్థాన్ ప్రాధాన్యం పెరగడం వంటి పరిణామాలు రూబియో ఎంత కాదన్నా నిజాలు కాకపోవు. ఐదువందల బిలియన్ డాలర్లు విలువచేసే అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలుకు సరేననేంతవరకూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌ను వదిలిపెట్టలేదు. మోదీ ఓ అద్భుతవ్యక్తి, ఆప్తమిత్రుడు అంటూనే ఖరీదైన అమెరికా, వెనెజువెలా చమురు భారత్‌కు అంటించేందుకు రంగం సిద్ధమవుతోంది.

## చంద్రుడి దక్షిణ ధ్రువంలో భూగర్భ మంచు

**మొదటిపేజీ తరువాయి -** యాత్రల గతిని మార్చే కీలక పరిణామంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 2019లో చంద్రయాన్-2 ల్యాండర్ చంద్రుడిపై దిగడంలో విఫలమైనప్పటికీ, దాని ఆర్బిటర్ మాత్రం కక్ష్యలో తిరుగుతూ విలువైన సమాచారాన్ని పంపుతూనే ఉంది. తాజాగా, ఆర్బిటర్‌లోని 'డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్' పంపిన డేటాను అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు విశ్లేషించారు. చంద్రుడిపై ఎన్నడూ సూర్యరశ్మి సోకని, అత్యంత శీతలంగా ఉండే శాశ్వత చీకటి ప్రాంతాల ఉపరితలం కింద ఈ మంచు నిల్వలు ఉన్నట్లు వారు నిర్ధారించారు. ముఖ్యంగా, ఫాస్టిని బేసిన్‌లోని ఒక బిలం కింద మంచు ఉనికికి బలమైన ఆధారాలు లభించాయని తెలిపారు. ఈ ఆవిష్కరణ అంతరిక్ష రేసులో వ్యూహాత్మకంగా భారత్‌కు గొప్ప ఆధిక్యాన్ని ఇచ్చింది. చంద్రుడిపై కనుగొన్న ఈ నీటి మంచును భవిష్యత్తులో తాగునీరుగా, శ్వాసకు అవసరమైన ఆక్సిజన్‌గా, రాకెట్లకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనంగా మార్చుకోవచ్చు. దీనివల్ల భూమి నుంచి ఇంధనాన్ని మోసుకెళ్లే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది.ప్రస్తుతం అమెరికా, చైనా వంటి దేశాలు చంద్రుని దక్షిణ ధ్రువంపై స్థావరాలు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో, నీటి వనరులు ఎక్కడ ఉన్నాయో కచ్చితమైన సమాచారాన్ని అందించి భారత్ కీలక పాత్ర పోషించింది. చంద్రయాన్-3 విజయంతో పాటు, ఇప్పుడు చంద్రయాన్-2 అందించిన ఈ డేటా ప్రపంచ అంతరిక్ష సమాజానికి అత్యంత విలువైనదిగా మారింది.

## ఎన్టీఆర్‌కు భారతరత్న.మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

**మొదటిపేజీ తరువాయి -** చంద్రబాబు తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది టీడీపీ సిద్ధాంతమని... ఎన్టీఆర్ ఇచ్చిన ఆ సిద్ధాంతం శాశ్వతంగా కొనసాగుతుందని చెప్పారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప చరిత్రలో మరెవరికీ సాధ్యం కాలేదని అన్నారు. సినీ చరిత్రలో ఎన్టీఆర్ కు ప్రత్యామ్నాయం లేదని... ఆయన చేసిన పాత్రలు మళ్లీ చేయాలంటే ఆయనే మళ్లీ పుట్టాలని వ్యాఖ్యానించారు.

## అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించారు. ఈ విజయం, త్వరలో చేపట్టనున్న 'హోప్' (వర్టికల్ టేకాఫ్ అండ్ వర్టికల్ ల్యాండింగ్) అనే పునర్వినియోగ రాకెట్ ప్రాజెక్టుకు, అలాగే క్రయోజెనిక్ ఇంజిన్ అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్షల్లో వాడిన ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్ సహా అన్ని పరికరాలను తమ ఇంజనీరింగ్ బృందమే దేశీయంగా తయారు చేసిందని అబ్యోమ్ వెల్లడించింది. ఈ విజయంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో జైనుల్ అబిదీన్ మాట్లాడుతూ "భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థల నిర్మాణంలో ఈ పరీక్షలు చాలా కీలకం. అంతరిక్ష ప్రయోగాల ఖర్చును భారీగా తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. తక్కువ ఖర్చుతో కూడిన రీయూజబుల్ స్పేస్‌ఫ్లైట్ కోసం టెక్నాలజీని మరింత ముందుకు తీసుకెళ్తున్నాం" అని వివరించారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ ఇంక్యుబేటర్ నుంచి అబ్యోమ్ స్టార్టప్ ప్రారంభమైంది. ఈ సంస్థకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబేతో పాటు డీఎస్‌టీ, ఇస్రో, మెయిటీ వంటి ప్రభుత్వ సంస్థల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. రాబోయే రోజుల్లో రీయూజబుల్ రాకెట్ ప్రోటోటైప్ ప్రదర్శనలు, క్రయోజెనిక్ ఇంజిన్ల అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు

**మొదటిపేజీ తరువాయి -** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు.

## జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయి: మంత్రి వివేక్

తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా

**మొదటిపేజీ తరువాయి -** సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన ప్రత్యేక కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు సిద్ధరామయ్య స్వయంగా వెల్లడించారు. అనంతరం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిద్ధరామయ్య కొంత భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి పార్టీ తనను ఎంతో ఆదరించిందని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా, రెండుసార్లు



సీఎంగా, ప్రతిపక్ష నేతగా తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. తాను ముఖ్యమంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని సిద్ధరామయ్య అన్నారు. తన కుటుంబంలో ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదని, తాను గ్రామీణ జీవితం నుంచి వచ్చానని, పొరపాటున రాజకీయాల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు. తన రాజకీయ జీవితంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా తనకు సీఎం అయ్యే అవకాశం కల్పించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించానని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని తాను బలంగా నమ్ముతానని, సమాజంలో అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే తన ఆకాంక్ష అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తన రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం తనకుందని ఆయన తెలిపారు.

# మృత్యుశిఖరంలా ఎవరెస్ట్ మారుతోం

**మొదటిపేజీ తరువాయి -** అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం చాలామందికి ఒక కల. కానీ ఆ కలను నిజం చేసుకునే ప్రయాణంలో ప్రాణాలకే ముప్పు తెచ్చే ఒక ప్రమాదకరమైన ప్రదేశం ఉంది. అదే 'డెత్ జోన్'. సముద్ర మట్టానికి 8,000 మీటర్ల (26,247 అడుగుల) ఎత్తు దాటిన తర్వాత మొదలయ్యే ఈ ప్రాంతంలో, ప్రాణవాయువు కొరతతో మానవ శరీరం నిమిషనిమిషానికీ క్షీణించడం మొదలవుతుంది. ఈ ఏడాది (2026) సీజన్‌లో ఇద్దరు భారతీయ పర్వతారోహకులతో సహా కనీసం ఐదుగురు ఇక్కడ ప్రాణాలు కోల్పోయారు. డెత్ జోన్‌లో గాలిలో ఆక్సిజన్ స్థాయి సముద్ర మట్టంతో పోలిస్తే కేవలం మూడో వంతు మాత్రమే ఉంటుంది. దీనివల్ల 'హైపోక్సియా' (ఆక్సిజన్ కొరత) ఏర్పడి, మొదట మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో గందరగోళం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, భ్రాంతులు కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సప్లిమెంటరీ ఆక్సిజన్ లేకుండా శిఖరంపైకి చేరితే, కేవలం 4 నిమిషాల్లో స్పృహ కోల్పోయి, 6 నిమిషాల్లో మరణం సంభవిస్తుంది. దీంతోపాటు మెదడు వాపు, ఊపిరితిత్తులలో నీరు చేరడం వంటి ప్రాణాంతక సమస్యలు కూడా తలెత్తుతాయి. శరీరం తనను తానే తినేస్తూ, కండరాలు బలహీనపడతాయి. ఇటీవల కాలంలో ఎవరెస్ట్‌పై రద్దీ విపరీతంగా పెరిగిపోవడం మరణాలకు మరో ప్రధాన కారణంగా మారింది. ఈ సీజన్‌లో నేపాల్ వైపు నుంచి ఒకేరోజు 274 మంది శిఖరాన్ని చేరుకున్నారు. ఈ రద్దీ వల్ల ప్రమాదకరమైన హిల్లరీ స్టెప్ వంటి ప్రాంతాల్లో గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. మైనస్ 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఇలా నిరీక్షించడం వల్ల శరీరం చల్లబడిపోవడమే కాకుండా, వెంట తెచ్చుకున్న ఆక్సిజన్ నిల్వలు కూడా వేగంగా అయిపోతున్నాయి. ఎక్కడం కన్నా దిగడమే అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శిఖరాన్ని



చేరుకునేసరికే శక్తి మొత్తం అయిపోవడంతో, తిరుగు ప్రయాణంలో నీరసం, ఆక్సిజన్ కొరత కారణంగా చాలామంది కుప్పకూలుతున్నారు. ఈ ఏడాది మరణించిన ఇద్దరు భారతీయులు కూడా శిఖరాన్ని అధిరోహించి, కిందకు దిగివస్తుండగా ప్రాణాలు విడిచారు. డెత్ జోన్‌లో వీలైనంత తక్కువ సమయం గడపాలని, వాతావరణం అనుకూలించకపోతే వెనుదిరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

## యువతకు అవకాశాల వెల్లువ.. నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి



**మొదటిపేజీ తరువాయి -** పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. డీఎస్సీ విషయంలో ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి లక్షలాది మంది యువతను ఆందోళనకు గురిచేశారని విమర్శించారు. "మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను సరిచూసుకోవాలి," అని ఆయన యువతకు హితవు పలికారు. కష్టపడటం ఒక్కటే విజయానికి మార్గమని, దానికి దగ్గరి దారులు ఉండవని లోకేష్ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. "నేను మా నాన్నగారితో పోటీ పడాలంటే ఆయన కంటే ఎక్కువ కష్టపడాలి. నా పాదయాత్రలో రోజూ పోరాటం ఎదుర్కొన్నాను. 2019లో ఓడిపోయినా భయపడలేదు, 2024లో 91 వేల మెజారిటీతో గెలిచాను. ఆ రోజు భయపడి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు" అని అన్నారు. పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఒక్క ఓటమి జీవితాన్ని నిర్ధారించదని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. యువత రాజకీయాల్లోకి రావాలని, తెలుగుదేశం పార్టీ వారికి సముచిత అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచే మొదలుకావాలని, వారికి 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్‌ఎంఈలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

## కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చింది



**మొదటిపేజీ తరువాయి -** తయారు చేస్తుందని అన్నారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు. రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని అన్నారు.

# ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర



సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఎస్ ఈఈఈపీసీ సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్డులపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

# సరికొత్త చరిత్ర..రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!

**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది. టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.



## పార్టీ పట్ల అంకితభావం చాటిన అమిలినేని కులశేఖర్ నాయుడు

మహానాడు వేదికగా టీడీపీకి రూ.23,116 విరాళం అందజేత



యాడికి మే 28 యువతరం న్యూస్ ; యాడికి మండల కేంద్రంలోని లక్ష్మీ ప్రియ థియేటర్లో హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయలచెరువుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు అమిలినేని కులశేఖర్ నాయుడు పార్టీ పట్ల తన అంకితభావాన్ని చాటుతూ రూ.23 వేల 116 రూపాయల చెక్కును పార్టీ విరాళంగా అందజేశారు. ఈ చెక్కును మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణకు అందజేస్తూ, ఈ మొత్తాన్ని పార్టీ ఫండ్‌గా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపించాలని కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. మహానాడు కార్యక్రమం సందర్భంగా నాయకులు పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీకి తమ మద్దతు ప్రకటించారు.

## సేవే మహోన్నతం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా జరిపిన అభిమానులు



యాడికి మే 28 యువతరం న్యూస్ ; యాడికి మండలంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి 103వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలుగు ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేతగా ఎన్టీఆర్‌ను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కడ్డీల నాగేంద్ర, ముత్యాలు, అశోక్, మనోజ్, అఖిల్, మైత్రి శ్రీ తదితరులు పాల్గొని ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా ఎన్టీఆర్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అగాపే ఆశ్రమ వ్యవస్థాపకుడు బత్తల ప్రసాద్ మాట్లాడుతూ, ఆశ్రమంలోని వృద్ధులు మరియు నిరాశ్రయులకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, స్థానికులు మరియు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు

## వేములపాడులో ఘనంగా బక్రీద్ వేడుకలు

పేదలకు దానం చేయాలని గురువు దాదావలి సందేశం




యాడికి, మే 28 (యువతరం న్యూస్):యాడికి మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో బక్రీద్ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే ముస్లిం సోదరులు ఈద్గా మైదానానికి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువు దాదావలి ఆధ్వర్యంలో జరిగిన నమాజ్ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గురువు దాదావలి బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అల్లా ఆదేశానుసారం తన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాంను బలి ఇవ్వడానికి సిద్ధమైన ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగను“త్యాగాల పండుగ”గా జరుపుకుంటారని తెలిపారు. పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధుమిత్రులకు, మూడవ భాగాన్ని తమ కుటుంబ సభ్యులతో పంచుకోవడం బక్రీద్ సందేశమని వివరించారు. ప్రేమ, త్యాగం, సహాయ సహకార భావనలను పెంపొందించే పండుగగా బక్రీద్ నిలుస్తుందని పేర్కొన్నారు. నమాజ్ అనంతరం మరణించిన వారిని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చివరగా ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని“ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## బూత్ స్థాయిలో వైఎస్సార్సీపీ బలోపేతానికి కేతిరెడ్డి పిలుపు




యాడికి మే 28 యువతరం న్యూస్ ; వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యాడికి మండల బూత్ లెవల్ ఏజెంట్ల ( ఎస్ ఐ ఆర్ -2026) సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గోపినాథ్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ఇంటింటి పరిశీలన, వివరాల ధృవీకరణ వంటి అంశాలపై నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి ఓటరిని కలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఎన్నికల దృష్ట్యా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని, పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో యాడికి మండలానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మోడీ సేవ సుపరిపాలన సంబురాలు

కర్నూలు జిల్లాలో అసెంబ్లీ ఇన్‌చార్జులుగా యువ నేతలకు కీలక బాధ్యతలు....

పత్తికొండ,ఆలూరు అసెంబ్లీల ఇన్చార్జిగా తుగ్గలి నవీన్ రెడ్డి...

తుగ్గలి మే28(యువతరం న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల ప్రజా సంక్షేమ,అభివృద్ధి పాలన పూర్తి సందర్భంగా జూన్ నెలలో నిర్వహించనున్న భారీ కార్యక్రమాలకు గురువారం రోజున అసెంబ్లీ వారీగా ఇన్‌చార్జులను నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రజా సమస్యల పై నిరంతరం పోరాడుతున్న యువ నాయకుడు తుగ్గలి నవీన్ రెడ్డి కు పత్తికొండ మరియు ఆలూరు అసెంబ్లీల బాధ్యతలు అప్పగించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి విస్తరింపజేస్తున్న నవీన్ రెడ్డి నియామకం పట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తుగ్గలి నవీన్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రధాని మోడీ గారి సేవా, సుపరిపాలన,పేదల సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తాం” అని ఆయన తెలిపారు. అసెంబ్లీ ఇన్‌చార్జుల వివరాలు కర్నూలు మరియు పాణ్యం అసెంబ్లీల ఇన్చార్జిగా నాగేశ్వరరావు, కోడుమూరు మరియు ఎమ్మిగనూరు అసెంబ్లీల ఇన్చార్జిగా సుజాత,ఆదోని మరియు మంత్రాలయం అసెంబ్లీల ఇన్చార్జిగా రమేష్ యాదవ్,పత్తికొండ మరియు ఆలూరు అసెంబ్లీల ఇన్చార్జిగా తుగ్గలి నవీన్ రెడ్డి లను నియమిస్తూ బిజెపి కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయని నవీన్ రెడ్డి తెలియజేశారు. జూన్ నెల మొత్తం పార్టీ శ్రేణులు,యువతతో కలిసి మండల,గ్రామ స్థాయిల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. బిజెపి పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి పత్తికొండ,ఆలూరు అసెంబ్లీల ఇన్చార్జిగా నియమించినందుకు శక్తి వంచన లేకుండా తనవంతు కృషిచేసి పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని పత్తికొండ,ఆలూరు



అసెంబ్లీల ఇన్చార్జ్ తుగ్గలి నవీన్ రెడ్డి తెలియజేశారు.

# మహానాడు వేడుకల్లో సేవా కార్యక్రమాలకు పెద్దపీట








రక్తదాన శిబిరం అన్నదానం భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు

యాడికి మే 28 యువతరం న్యూస్ ; యాడికి లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం రెండవ రోజు యాడికి మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. యాడికిలోని లక్ష్మీ ప్రియా థియేటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహానాడు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొని పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహానాడు కార్యక్రమంలో సేవా కార్యక్రమాలకు కూడా పెద్దపీట వేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువత మంచి స్పందన వచ్చింది. పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన యువతను నాయకులు అభినందించారు. అలాగే మహానాడు కార్యక్రమానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజల కోసం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగింది. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు ఆశయాలను కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు మహానాడు ఒక ఉత్సాహాన్ని ఇచ్చే వేదిక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జెండాలు, బ్యానర్లు, నినాదాలతో లక్ష్మీ ప్రియా థియేటర్ పరిసరాలు పసుపుమయం అయ్యాయి. కార్యకర్తలు “జై తెలుగుదేశం” నినాదాలతో సందడి చేశారు. యువత ఉత్సాహంగా పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహానాడు సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయని, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది ఈ కార్యక్రమంలో ప్రజలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## సహజ మరణంగా తేలిన వెంగమనాయుడు కాలనీ ఘటన



యాడికి మే 28 యువతరం న్యూస్ ; యాడికి మండల పరిధిలోని వెంగమనాయుడు కాలనీలో గురువారం సాయంత్రం అపస్మారక స్థితిలో కనిపించిన వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మొదట గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన మృతుడి వివరాలు అనంతరం తెలిసినట్లు సమాచారం. మృతుడు కొలిమిగుండ్ల మండలం గొర్విమాను పల్లి గ్రామానికి చెందిన బూర్గుల మదన సుధాకర్ (34)గా గుర్తించారు. ఆయన తండ్రి పేరు మద్దిలేటి. మృతుని భార్య స్వగ్రామం కమలపాడు కావడంతో అక్కడికి వస్తున్న సమయంలో అతిగా మద్యం సేవించినట్లు తెలిసింది. కమలపాడు వెళ్లే మార్గంలో వెంగమనాయుడు కాలనీ వద్ద ఉన్న ఆర్చి సమీపంలో బండపై కూర్చున్న సుధాకర్ అకస్మాత్తుగా క్రిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అక్కడ సమీపంలో ఉన్న గ్రామస్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు వెల్లడించారు. పరిశీలన అనంతరం మృతుడి మరణం సహజ మరణంగా నిర్ధారణ అయినట్లు సమాచారం ఘటనపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఘనంగా బక్రీదు వేడుకలు



పామిడి, యువతరం న్యూస్ మే 28: పట్టణంలో ముస్లిం మైనార్టీలు గురువారం బక్రీదు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ బక్రీదు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీదు సారాంశమన్నారు. పండుగ సందర్భంగా ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇస్తారన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీదు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంవిశేషమని పలువురు ముస్లిం మైనార్టీలు పేర్కొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలకు ప్రజల ప్రశంసలు

90 మందికి పరీక్షలు 30 మంది ఉచిత ఆపరేషన్లకు ఎంపిక



యాడికి మే 28 యువతరం న్యూస్ : యాడికి మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, బెంగళూరు శంకరా కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరానికి పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ శెట్టి మాట్లాడుతూ, శిబిరానికి మొత్తం 90 మంది హాజరుకాగా, వారిలో 30 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారిని ఉచితంగా బస్సులో బెంగళూరుకు తీసుకెళ్లి శస్త్రచికిత్సలు నిర్వహించి, అనంతరం తిరిగి వారి గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు వివరించారు. బెంగళూరు శంకరా కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది డాక్టర్ రేఖ, నబియా సేవలను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందిస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ట్రెజరర్ అల్లా బకాష్ భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామనాథ్, ట్రెజరర్ అల్లా ప్రకాష్, ఇస్మాయిల్, సూర్యనారాయణ, మాదాల ప్రసాద్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103 జయంతి...

టిడిపి సీనియర్ నాయకుడు పర్వతనేని శ్రీధర్ బాబు...



బుక్కరాయసముద్రం మే 28 యువతరం న్యూస్ :-బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి 103 జయంతి సందర్భంగా పర్వతనేని శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పూలమాలవేసి కేకు కట్ చేసి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామనాయుడు లక్ష్మీనారాయణ యాదవ్ తలారి ఆది, సురేష్,చౌదరి నరేంద్ర యాదవ్, వడ్డే రామకృష్ణ, అరుగుల రాజు, ఆదినారాయణ, గోపాల్ నాయుడు, రెడ్డిపల్లి నాయుడు,ఓలపతి, నాగేష్,శంకర,వెంకటేష్ బోలే అక్కులప్ప,మధు గౌడ్,తదితరులు పాల్గొన్నారు

Yuvatharam News
యువతరం న్యూస్
The Voice of youth
శుక్రవారం 29-05-2026

# కర్నూలు నగరంలోని 29వ వార్డులో సమస్య లు పరిష్కరించాలి

సిపిఐ నగర సహాయ

కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు.





కర్నూలు ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ : కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 29వ వార్డులో సప్తగిరి కాలనీ సాయినాథ్ నగర్, బాలాజీ నగర్ లలో మురుగునీరు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయాలని డి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు గురువారం నాడు 29వ వార్డుల సమస్యలు తెలుసుకునేందుకు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో వార్డులో పర్యటించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు మాట్లాడుతూ 29వ వార్డులోనే బాలాజీ నగర్, సాయినాథ్ నగర్,సప్తగిరి కాలనీలో మురుగునీరు రోడ్డులో ప్రవహించి వచ్చిపోయే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతావున్నారు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల రోడ్డుపైన మురుగునీళ్లు ఆగి దోమలకు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడమే కాకుండా మురుగునీరు దోమలకు నిలయులుగా మారి స్థానిక ప్రజలు తరచూ డెంగ్యూ, మలేరియా, స్కిన్ ఎలర్జీ లాంటి అనారోగ్యానికి గురవుతున్నారని కావున ఈ కాలనీలో వెంటనే డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమస్యపై మున్సిపల్ అధికారుల స్పందించకపోతే సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం లక్ష్మి, గణేష్ రెడ్డి, ఏఆర్కె నాయుడు, సుధాకర్ నారాయణమ్మ మొదలగువారు పాల్గొన్నారు.

# పరుగులు పెడుతున్న ఇంధన ధరలు: నెల రోజుల్లోనే రూ. 8 పెంపు!




సామాన్యుడిపై మోయలేని భారం.. ఆందోళనలో వాహనదారులు, రవాణా రంగం

పామిడి, మే 27 యువతరం న్యూస్ : దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు సరికొత్త రికార్డులను తాకుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మే నెలలోనే వరుసగా నాలుగోసారి ధరలను పెంచడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో ధరలు పెంచబోమని హామీ ఇచ్చినప్పటికీ, ఫలితాలు వచ్చిన నెల రోజుల్లోనే ఇంధన మంటలు ప్రారంభమవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు విడతల్లో దాదాపు రూ. 8 వరకు ధరలు పెరగడంతో, దీని ప్రభావం రవాణా రంగంపై పడి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం కనిపిస్తోంది. మే నెలలో ధరల పెంపు ఇలా.. (ట్రైమ్‌లైన్) ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెట్ సంస్థలైన హెపిసిఎల్ , బీపీసీఎల్, ఐఓసీఎల్ లు మే

నెలలో పెంచిన ధరల వివరాలు:

| తేదీ | పెట్రోల్ పెంపు (లీటరుకు) | డీజిల్ పెంపు (లీటరుకు) |
|---|---|---|
| మే 15, | రూ. 3.00 | రూ. 3.00 |
| మే 19, | 90 పైసలు | 90 పైసలు |
| మే 23, | 87 పైసలు | 91 పైసలు |
| మే 25, | రూ. 2.61 | రూ. 2.71 |

ధరల మార్పు: ఈ పెంపుతో లీటర్ పెట్రోల్ ధర రూ. 108.62 నుండి రూ. 118.14 కు చేరింది. అలాగే డీజిల్ ధర లీటరుకు రూ. 96.52 నుండి రూ. 109.57 కు పెరిగింది.అంతర్జాతీయ సంక్షోభం - ముంచుకొస్తున్న ధరల భారం ఇటీవల అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం కారణంగా ఇంధన కొరత ఏర్పడి, రెండు రోజుల పాటు బంకుల వద్ద వాహనదారులు కిలోమీటర్ల మేర క్యూ కట్టారు. అధికారులు స్పందించి కొరత తీర్చారనే లోపే, కేంద్ర ప్రభుత్వం ఈ భారీ ధరల వడ్డనతో కోలుకోలేని దెబ్బతీసింది.బహుముఖ ప్రభావంరవాణా ఒ ఆర్టీసీ: సరుకు రవాణా ఛార్జీలు పెరగడం వల్ల నిత్యవసరాలు, కూరగాయల ధరలు మరింత పెరగనున్నాయి. ఆర్టీసీ ఛార్జీలు, ఆటో ప్రయాణ భారం కూడా పెరిగే అవకాశం ఉంది.వ్యవసాయ రంగం: ప్రస్తుతం సాగు పనులన్నీ ట్రాక్టర్లపైనే ఆధారపడి ఉన్నాయి. వందలాది లీటర్ల డీజిల్ అవసరమయ్యే రైతులకు ఈ పెంపు అదనపు భారంగా మారింది.పరిశ్రమలు: పెట్రో ఆధారిత అనుబంధ పరిశ్రమలపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా ఉండనుంది.

**మిన్నంటిన నిరసనలు**

ధరల పెంపును నిరసిస్తూ రాష్ట్రంలో వామపక్షాలు కూడా పెద్ద ఎత్తున ర్యాలీలు, ఆందోళనలు చేపట్టాయి. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ధరలను తగ్గించకపోవడంపై సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజానీకం డిమాండ్ చేస్తోంది.

# మిన్నంటిన 'మహానాడు' సంబరాలు!

కార్యకర్తల శ్రమతోనే కూటమి విజయం: టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్





పామిడి, మే 28 యువతరం న్యూస్ :పట్టణంలో గురువారం మహానాడు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని టీడీపీ కార్యాలయంతో పాటు, ఎద్దులపల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు తమ్ముళ్లు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**ఘన నివాళులు - బైక్ ర్యాలీ**

కార్యక్రమం ప్రారంభానికి ముందు పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వర్చువల్ హైబ్రిడ్ మహానాడు కేంద్రాలకు తెలుగు తమ్ముళ్లు భారీ బైక్ ర్యాలీతో తరలివెళ్లడంతో పట్టణంలో పసుపు పండగ వాతావరణం నెలకొంది.

**అభివృద్ధి కరపత్రం విడుదల**

ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న, ఇప్పటికే పూర్తి చేసిన వివిధ అభివృద్ధి పనుల వివరాలతో కూడిన ప్రత్యేక కరపత్రాన్ని టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆవిష్కరించారు. కార్యకర్తల అహర్నిశల కృషి, త్యాగాల ఫలితమే రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వ స్థాపన. ఇదే ఉత్సాహంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమి అభ్యర్థుల భారీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా శ్రమించాలి. ఈ సంబరాల్లో నియోజకవర్గ, మండల స్థాయి టీడీపీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

# ఎన్‌టీఆర్ కీర్తిప్రతిష్టలు అజరామరం

# నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి





పాములపాడు మే 28 యువతరం న్యూస్ :-పాములపాడు క్లస్టర్ పరిధిలో నిర్వహించిన మహానాడు-2026 కార్యక్రమంలో రెండవ రోజు నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్, మండల నాయకులతో, కార్యకర్తలతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడ్, తదితర నాయకులు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని అన్నారు.ఎన్‌టీఆర్ కీర్తిప్రతిష్టలు అజరామరమని అందరూ నాయకులతో కలిసిఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి, సమాజ సేవకు ఎన్‌టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగు జాతి గర్వపడే విధంగా ఎన్‌టీఆర్ అమలుచేసిన విప్లవాత్మక పరిపాలనా సంస్కరణలు ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని.. పరిపాలనను ప్రజలకు చేరువచేయాలనే ఉద్దేశంతో సాహసోపేత నిర్ణయాలను తీసుకున్న మహోన్నత వ్యక్తి ఎన్‌టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమష్టిగా పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లు చెల్లె హరినాథ్ రెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, మద్దూరు తిమ్మారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం బాష, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డిసి) ఆల్ఫ్రెడ్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, నెంబర్ లక్ష్మన్న, రత్నాకర్, మల్లికార్జున నాయుడు, జనసేన శేషు, చిన్న హుస్సేనయ్య, జనార్ధన్, పాములపాడు సొసైటీ చైర్మన్ సి.గోవిందు, మద్దూరు సొసైటీ చైర్మన్ వాడాల జనార్దన్ రెడ్డి, డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, మిట్టకందాల మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్, మస్తాన్, కృష్ణానగర్ ముడియాల సుబ్బారెడ్డి, జూటూరు హాఫీజ్, రుద్రవరం సురేష్, ఎర్రగూడూరు శివ శంకర్ స్వామి, ఇస్కాల నాగలక్ష్మి రెడ్డి, లింగాల మాజీ సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నాయకులు







ఇది కార్యకర్తల పండగ

ఘనంగా పసుపు పండగల

నిర్వహించిన మహానాడు





అమడగూరు మే 28 ( యువతరం న్యూస్ ) : అమడగూరు మండల,వ్యాప్తంగా పసుపు పండుగ మహానాడు రెండో రోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి జయంతిని ఘనంగా నిర్వహించారు. మన ప్రియతమ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మరియు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హాస్పిటళ్లలో రోగులకు బెడ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. "మరణం లేని మహానేత ఎన్టీఆర్" అంటూ నాయకులు ఆయన సేవలను స్మరించుకున్నారు.అనంతరం శ్రీ చౌడేశ్వరి కళ్యాణ మండపంలో, ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా మంగళగిరిలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారం,అలాగే మండల కేంద్రంలో అభివృద్ధి, పార్టీ బలోపేతంపై చర్చలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత శ్యాంబాబు నాయుడు, రాష్ట్ర డైరెక్టర్ కాలేనాయక్, డీలర్ వెంకటరెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి సోమశేఖర్, నాగేందర్ రెడ్డి, డీలర్ గాయత్రి, ఇందుకూరు కుమార్ రెడ్డి,,టి ఎస్ ఎఫ్ రామాంజుల నాయుడు, సర్వేయర్,సురేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజులు, సోషల్ మీడియా మీసం అంజి,డి కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, డి నరసింహమూర్తి, నంజప్ప, ఓ బాలకృష్ణ, డీలర్, భాస్కర్ రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు ఒలిపి కిష్టప్ప, ఎస్సీ సెల్, అధ్యక్షుడు పి,చంద్రశేఖర్ డీలర్,పిక్కిలి రెడ్డప్ప, ఈశ్వరప్ప, డీలర్ కృష్ణారెడ్డి, ఐకెపి సిబ్బంది, మహిళా సంఘాల నాయకురాలు,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండవ రోజు మహానాడు డివిజనల్ వర్చువల్ మీటింగ్ లో ఘనంగా 103 వ జయంతి లో పాల్గొన్న

మాజీ టిడిపి రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి కాట్టప్ప గారి రామలింగారెడ్డి...








బుక్కరాయసముద్రం మే 28 యువతరం న్యూస్ :- బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఆర్ కళ్యాణమండపం నందు క్లస్టర్ -5 పరిధిలో రెండోవ రోజు మహానాడు డిజిటల్ వర్చువల్ మీటింగ్ లో ముఖ్యఅతిథిగా హాజరుఅయి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి రామారావు 103 వ జయంతి సందర్భంగా కేక్ కటింగ్ చేసి,ఎన్టీఆర్ చిత్ర పటంకు పూలమాల వేసి నివాళులు అర్పించినా మాజీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి .ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ కుమార్, మండల కన్వీనర్ లక్ష్మినారాయణ , సింగల్ విండో అధ్యక్షులు కేశన్న , టీడీపీ నాయకులు ఎస్ . నారాయణస్వామి , మాజీ ఎంపీపీ నాఖ వెంకటేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శైలజ,మండల అధికార ప్రతినిధి ఓబుళపతి,క్లస్టర్ -5 చిత్తంబిరి, బాబాయ్య, హరి పటేల్ భూసి,సన్న మల్లికార్జున, ఓబన్న,పెద్ద బాబాయ్య, టీడీపీ మహిళ నాయకురాలు రంగమ్మ, ఎక్స్ ఎంపీటీసీ. రాజేశ్వరి, రాజేశ్వరి, మన్నెరి కొండమ్మా, చామండి,వెంకటేష్, వన్నూరుప్ప,రామచంద్ర రెడ్డి, రామచంద్ర రెడ్డి, గోగుల నాగేష్, శివారెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణ రెడ్డి,గంపన్న, వాసుదేవ రెడ్డి, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించండి



పాములపాడు మే 28 యువతరం న్యూస్ పాములపాడు:-ఆరుగాలం కష్టపడి అన్నదాత పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించి మద్దతు ధరలు పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పాములపాడు లోని స్థానిక బస్టాండ్ సెంటర్ లో గురువారం రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించి మద్దతు ధర కల్పించలేని కాపీలను దహనం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న జొన్నలు పలు రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఇస్తున్న మద్దతు ధరను పెంచాలన్నారు మొక్కజొన్న పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు నిలువునా దళాల వ్యవస్థలో దోపిడీకి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అధికారంలోనికి రావడానికి రాజకీయ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతారు తప్ప అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోయి రైతులను పట్టించుకునే వారే కరువయ్యారన్నారు అలాగే ఎరువులు ధరలు అమాంతంగా పెరుగుతున్న రైతులకు మాత్రం పండించిన పంటకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు అదేవిధంగా జొన్నలు మద్దతు ధర ప్రకటించి కొంటామని చెప్పారు తప్ప గ్రామాల్లో జొన్నలు కొనే నాథులు లేక జొన్నల బస్తాల నిల్వలు అలాగే ఉన్నాయని రైతులు ఏమి చేయాలో దిక్కు తోచని ఆందోళన స్థితిలో ఉన్నారని విచారం వ్యక్తం చేశారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిచి రైతులు పండించే పంటలకు మద్దతు ధర ప్రకటించి ప్రతి రైతును ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించ లేనట్లయితే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి స్వామన్న రమణ బాల యేసు ఎస్ బాలయ్య రైతులు పాల్గొన్నారుదు

# భక్తి శ్రద్దలతో,బక్రీద్, వేడుకలు



అమడగూరు మే 28( యువతరం న్యూస్) : అమడగూరు మండలం లో ముస్లిముల పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.మండలంలోని అమడగూరు, చినగానిపల్లి, కస్స ముద్రం మహమ్మాదాబాద్, జేకెపల్లి, తుమ్మల, కొట్టువారిపల్లి, లోకోజుపల్లి, పూలుకుంటపల్లి, రెడ్డివారిపల్లి, తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భారీ సంఖ్యలో పాల్గొని ప్రార్థనలకు భారీగా తరలివచ్చారు. నమాజు అనంతరం స్నేహితులు, బంధుమిత్రులు ఆలింగనాలు చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.ఈద్గా లు వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించడంతో ఎక్కడ చూసిన సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటల నుంచి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవచనాలు ఖురాన్ పఠనం చేశారు. బక్రీద్ రోజు ప్రత్యేకంగా పేద ప్రజలకు దానధర్మాలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని భావించి కొందరు ముస్లింలు ప్రతి రోజు అన్నదానం దానధర్మాలు చేయడం వల్ల తెలియక చేసిన పాపాలు తొలగిపోతాయని సంపూర్ణ దైవదర్శనం సిద్ధిస్తుందని ముస్లిం సోదరులు విశ్వసిస్తారు.ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి మహానాడు వేడుకలు

ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు,! మహానాడు విజయ వంతం



పెద్దవడుగూరు, మే 28 యువతరం న్యూస్ : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 రెండవ రోజు కార్యక్రమాలు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. పెద్దవడుగూరు, క్లస్టర్-02 పరిధిలోని జెసి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.తెలుగుదేశం పార్టీ పెద్దవడుగూరు మండల నాయకులు చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, తెదేపా శ్రేణుల సమక్షంలో ఎన్టీఆర్ జయంతి కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణులంతా 'మై టిడిపి' యాప్ ద్వారా తమ హాజరును డిజిటల్ పద్ధతిలో నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత మహానాడు వర్చువల్ మీటింగ్‌కు పెద్ద ఎత్తున హాజరై అగ్రనాయకత్వం సందేశాలను వీక్షించారు. కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు, కార్యకర్తలకు మరియు అభిమానులకు అందరికీ మండల కమిటీ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు....

Yuvatharam News
యువతరం న్యూస్ The Voice of youth
శుక్రవారం 29-05-2026

# గ్రామ ప్రజలకు వెలుగులు నింపిన నైస్ ఫౌండేషన్

### ఆరు లక్షల విలువైన 30 సోలార్ లైట్స్ పంపిణీ



నాగర్ కర్నూల్ ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ : లింగాల మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామంలో నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు లక్షల రూపాయల విలువైన 30 సోలార్ లైట్స్ ఏర్పాటు చేయడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. గ్రామంలో రాత్రివేళలలో ప్రజలకు వెలుతురు సౌకర్యం కల్పించేందుకు ఈ సోలార్ లైట్స్‌ను అందించగా గ్రామస్థులు ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా గ్రామంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన సోలార్ లైట్స్ వల్ల ప్రజలకు రాత్రి సమయంలో సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పద్మనపల్లి గ్రామ సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎప్పటికప్పుడు సహకరిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న నైస్ ఫౌండేషన్ పూర్ణచందర్ రావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఆర్డిటి ఏటిఎల్ రాధా ను కూడా ఆయన అభినందించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామంలో సోలార్ లైట్స్ ఏర్పాటు చేయడంతో మహిళలు, యువకులు, వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో వెలుతురు సమస్య కొంతవరకు పరిష్కారమైందని ప్రజలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనపల్లి సర్పంచ్ శంకర్, ఎర్రపెంట మాజీ సర్పంచ్ సన్నయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మల్లోని చెరువు తండా వద్ద అక్రమ ఇసుక డంపులు

### రాత్రివేళల్లో యథేచ్ఛగా ఇసుక రవాణా



నాగర్ కర్నూల్ ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ : లింగాల మండల పరిధిలోని మల్లోని చెరువు తండా సమీప ప్రాంతంలో అక్రమ ఇసుక డంపులు భారీగా వెలిసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరులు అధికారుల కళ్లుగప్పి పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తూ డంపులు ఏర్పాటు చేస్తున్నారని గ్రామ ప్రజలు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి నిల్వ చేసి అనంతరం అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువు పరిసర ప్రాంతాలు, వాగుల వద్ద నుంచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు అంటున్నారు. అక్రమ ఇసుక రవాణా కారణంగా రోడ్లు దెబ్బతింటుండటమే కాకుండా గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఇసుక మాఫియా దందాతో కొందరు మూడు పువ్వులు ఆరు కాయలుగా సంపాదిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధుల అనుచరుల అండదండలతోనే ఈ అక్రమ వ్యవహారం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి అక్రమ ఇసుక డంపులపై దాడులు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అక్రమ ఇసుక రవాణాను అరికట్టి సహజ వనరులను కాపాడాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# తెలుగు ప్రజల ఆరాధ్య దైవం



నందమూరి తారక రామారావు ఆంధ్రుల ఆరా ధ్య దైవం “నటరత్న “నందమూరి తారకరామారావుప్రతి అడుగు ప్రగతిసేవం సమయపాలన నీతి నిజాయితీలే ఆభరణం/విభిన్న పాత్రలను అవలీలగా పోషించి సినీ వినీలాకాశంలో ధ్రువతారగా నిలిచావు పేదవాడి అభ్యున్నతకే తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆరు మాసాల్లోనే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తెలుగువారి హృదయాల్లో నిలిచావు/తెలుగువారి అవునిత్యాన్ని ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని విశ్వవ్యాప్తంగా శ్రీరాములు శ్రీకృష్ణుడు సుయోధనుడు, రావణుడు వంటి పురాణ పాత్రల కు పాతాళభైరవి నుండి దానవీరశూరకర్ణ వరకు విభిన్న పాత్రలకు జీవం పోసి భక్తుల హృదయగుడిలో దేవుడివైనావు/తెలుగు వారంతా అన్నగారు అని అభిమానంతో ప్రేమతో ఆత్మీయంగా ముద్దుగా పిలుచుకునే పేరు మీ పేరు/తెలుగు జాతి ప్రగతికి చిహ్నం సినిమా తెరపై వెలిగిన మహాశక్తి ప్రతిపాత్రలో జీవించిన తేజోమయుడుతెలుగు ప్రజల దీపానివి/ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు మార్గదర్శిగా ప్రజల హక్కులను కాపాడిన ధైర్యవంతుడు సినిమా నుండి రాజకీయాల వరకు తనదైన ముద్ర వేసిన మహాశయుడు/ఇటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో కీర్తితో మకుటం లేని మహారాజువైనావు/తెలుగు తమిళం హిందీ భాషల్లో నాలుగు వందలుచిత్రాలలో మీ నటనా ప్రతిభను ప్రదర్శించి నట శిఖరంగా నిలిచావు/నటనకే పరిమితం కాక అనేక చిత్రాలను నిర్మించి దర్శకత్వం వహించి సినీ కళామతల్లి కి సేవలు చేసిన మీ వ్యక్తిత్వం అంకితభావం క్రమశిక్షణ సమయపాలన మరువలేని ది/తెలుగు భాషకు తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి నందమూరి తారకరామారావు/ఆడపడుచులకు అండగా ఆస్తి హక్కును ప్రసాదించి అన్నగా నిలిచావు నిమ్మకూరులో జన్మించి నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించావు/తెలుగుజాతి ఘనత నందమూరి చరిత తెలుగుదనం తెలుగువారి ఆత్మగౌరవ ప్రతిరూపం పేదవారి ఇంట్లో దీపం నీ రూపంతెలుగువారి దీప్తి నటరత్న నందమూరి/కళ్ళు మూసుకుంటే విశ్వావిఖ్యాతమైన మీ నట విశ్వరూపం మా హృదయంలో స్పందిస్తూనే ఉంటుంది నిరంతరం/నల్లా నరసింహమూర్తి సీనియర్ తెలుగు లెక్చరర్ శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులురాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత 2026

# బక్రీదు పండుగకు పటిష్ట భద్రత







కర్నూలు ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ :గురువారం బక్రీదు పండుగ సందర్భంగా దర్గా, మసీదులు, ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకుంటూ పోలీసు శాఖకు సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు.

# లోతట్టు ప్రాంతాల్లో మంచినీటి కష్టాలు



### సమస్య పరిష్కారం చేయకపోతే

### పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన : సిపిఐ హెచ్చరిక

అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ మే 28 యువతరం న్యూస్ :అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని చోడవరం మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న తామర చెరువు వీధి, చందక వీధి శివారు ప్రాంతాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా మారిందని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.



సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యటనలో స్థానిక మహిళలు తమ సమస్యలను వెల్లడించారు. ప్రాంతంలో తాగునీరు సరఫరా సక్రమంగా లేకపోవడంతో మహిళలు సుమారు కిలోమీటర్ దూరం వెళ్లి మంచినీరు తెచ్చుకునే దుస్థితి నెలకొన్నదని వారు వాపోయారు. పైఎగువ ప్రాంతాల్లో నీటి వృథా, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లోతట్టు ప్రాంతాలకు నీరు చేరడం లేదని ఆరోపించారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదని నిర్వాసితులు తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ, చోడవరం పంచాయతీలో మంచినీటి సరఫరాలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని, కలుషిత నీటి కారణంగా ప్రజలు టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. గత గ్రామసభల్లో ఈ సమస్యలను ప్రస్తావించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పంచాయతీలో వాటర్ ఫిట్టర్ లేకపోవడం కూడా సమస్యలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి సంతకి వీధి శివారు ప్రాంత ప్రజలకు సక్రమంగా మంచినీరు అందించేలా చర్యలు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది. లేని పక్షంలో మహిళలతో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఈ సందర్భంగా సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూనూరు వరహాలమ్మ, చప్పు కుమారి, శనివాడ సత్యవతి, పోతల సంతోషి, దోకల అమ్మాజీ, పైడా నాగమణి, దేవి, లక్ష్మి, అప్పుల నరసమ్మ, అరుణ, నారాయణమ్మ తదితరులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# చోడవరంలో “ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు” కార్యక్రమం ప్రారంభం

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ మే 28 యువతరం న్యూస్: చోడవరం ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కారం మరియు రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన కార్యక్రమం “ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు”( వన్ మంత్ వన్ కాన్సెన్సీ ఫోర్ విజిట్స్ ) కార్యక్రమాన్ని చోడవరంలో శుక్రవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు మరియు భూపరిపాలన కమిషనర్ (సీ సీ ఆర్ ఎస్ ) మార్గదర్శకాలు ప్రకారం ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని 26-చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. 29 మే 2026 (శుక్రవారం) ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు చోడవరం మండలం కేంద్రంలోని “ మాధవ ఫంక్షన్ హాల్, కొత్తూరు జంక్షన్, చోడవరం మండలం” లో ఈ కార్యక్రమాన్ని చోడవరం నియోజకవర్గ శాసనసభ్యులతో కలసి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి అర్జీలు మిగిలి ఉండకుండా, పూర్తిగా సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజల ఫిర్యాదుల పరిష్కార సేవలను వారి ఇంటి వద్దకే చేర్చడం, ప్రజల నుండి వచ్చే గ్రీవెన్స్ (ఫిర్యాదులను) కేవలం ఒక్క నెల వ్యవధిలోనే పరిష్కరించడం, ఒకే సమస్యపై ప్రజలు పదేపదే అర్జీలు పెట్టుకునే అవసరం లేకుండా శాశ్వత పరిష్కారం చూపడం మరియు కోర్టు వివాదాలను తగ్గించడం అదేవిధంగా శాచ్యురేషన్ (సంతృప్తి) పద్ధతిలో రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలుగా మార్చడం ముఖ్య ఉద్దేశమని, ప్రభుత్వ పరిపాలనపై పౌరుల్లో నమ్మకాన్ని, సంతృప్తిని పెంపొందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చోడవరం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, వివిధ శాఖలకు చెందిన తమ సమస్యలు, ముఖ్యంగా రెవెన్యూ మరియు ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను రేపు ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి, త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. చోడవరం నియోజకవర్గ కేంద్రంలో మే 29, 2026న నిర్వహించ తలపెట్టిన ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల నుండి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు హాజరుకావాలని ఆదేశించారు. చోడవరం నియోజకవర్గ పరిధిలోని మండల అధికారులు, నాలుగు మండలాలకు చెందిన విలేజ్ రెవెన్యూ అధికారులు (వి ఆర్ ఓ స్ ) తమ పరిధిలోని పూర్తి గ్రామీణ సమాచారం మరియు రికార్డులతో సదస్సుకు రావాలని స్పష్టం



చేశారు. ఇప్పటివరకు అందిన మొత్తం పి. జీ.ఆర్. ఎస్. (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించబడిన దరఖాస్తుల వివరాలు, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్యతో పాటు ఒకే వ్యక్తి నుండి ఒకే సమస్యపై పదేపదే వచ్చిన పునరావృత అర్జీల వివరాలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

# మహానాడులో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



### ఈ నెల 29న చోడవరం కేంద్రంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

### బానయ్య కోనేరు ద్వారకానగర్ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ మే 28 యువతరం న్యూస్: చోడవరం టౌన్‌లో నిర్వహించిన రెండు రోజుల మహానాడు--2026--9 క్లస్టర్ మీటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి, యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేతగా ఎన్టీఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సినీ రంగంలో అపార ఖ్యాతిని సంపాదించిన ఆయన, ప్రజాసేవ పట్ల అంకితభావంతో రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజల సంక్షేమం కోసం



ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. తెలుగు జాతికి ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 29న చోడవరం నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మాధవ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారని చెప్పారు. చోడవరం, రావికమతం, బుచ్చయ్యపేట, రోలుగుంట మండలాలకు చెందిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక, భూ సంబంధిత సమస్యలపై లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఇక చోడవరంలోని బానయ్య కోనేరు, ద్వారకానగర్ ప్రాంతాలకు సంబంధించిన పట్టాల రెగ్యులరైజేషన్ అంశంపై కూడా ఎమ్మెల్యే స్పందించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న శాశ్వత పట్టాలు, గృహ నిర్మాణ సమస్యల పరిష్కారం కోసం నిర్వాసితులందరూ కలిసి వచ్చి తమ వివరాలు



నమోదు చేసుకోవాలని కోరారు. బానయ్య కోనేరు, ద్వారకానగర్ సమస్యను ఎలాగైనా శాశ్వతంగా పరిష్కరించడం తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు కనిశెట్టి మత్సరాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి చిన్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, డైరెక్టర్లు పప్పు శ్రీను, బాలిబోయిన దేముళ్లు, ఎంపీటీసీ రూపాదేవి, మాజీ వార్డు సభ్యులు నేమాల ధనలక్ష్మి హరి, టీ శ్రీనివాస్, రొంగలి దివ్య, పట్నాల సంతోష్, యూత్ నాయకులు నౌడు సుధాకర్, సకురు కోటేశ్వరరావు, గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ గుమ్మాల సత్తిబాబు, ద్వారపూడి శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షులు ఈర్లే శ్రీనివాస్, మాదిరెడ్డి జోగినాయుడు, ముడుసు గోవింద, కండిపల్లి అప్పలరాజు, శివాలయం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ పుల్లేటి శంకర్, కార్తికేయ వర్మ, తాడి పనసారెడ్డి, గూనూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డోన్ లో ఎన్టీఆర్ 103వ జయంతి ఘనంగా నిర్వహించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల








(డోన్ ప్రతినిధి మే 28 యువతరం న్యూస్) : ఇంధన పొదుపు బాధ్యతగా మహానాడు 2026 మహా పండుగ సందర్భంగా డిజిటల్ మరియు భౌతిక రూపాల కలయికలో క్లస్టర్ స్థాయిలో హైబ్రిడ్ పద్ధతిలో 2 వ రోజు ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం,క్లస్టర్ 07 లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ లో ప్రత్యేక ప్రసారం విచ్చేస్తున్న అదేవిధంగా డోన్ పట్టణంలోని తారకరామా నగర్ బేతంచెర్ల ప్యాపిలి చిన్న మల్కాపురం ఉడుములపాడు జలదుర్గం లో స్వర్గీయ నందమూరి తారక రామారావు 13వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి సాటి చెప్పిన మహానేత ఎన్టీఆర్ సేవలు స్మరసనీయమని పేర్కొన్నారు ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. సీనియర్ ఎన్టీఆర్



బాలకృష్ణ అభిమానులు ఫ్యాన్స్ ప్రెసిడెంట్ మంగలి నాగేశ్ ఆధ్వర్యంలో యువ నాయకులు కోట్ల రాఘవేందర్ రెడ్డి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసిస్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎన్టీఆర్ బాలకృష్ణ అభిమానుల తో పాటు టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళు అన్న ఆ మహనీయుని 103వ నందమూరి తారక రామారావు జయంతి(మహానాడు) వేడుకలో పాల్గొన్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి





(డోన్ ప్రతినిధి మే 28 యువతరం న్యూస్) : చివరిరోజు మహానాడు కీ.శే స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా డోన్ పట్టణంలో ఎం.ఎస్.ఆర్ క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన నందమూరి తారక రామారావు,జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి,డోన్ నియోజకవర్గ టిడిపి నాయకులతో కలిసి తెలుగుదేశంపార్టీ జెండాను ఆవిష్కరించి నందమూరి తారక రామారావు విగ్రహమునకు పూలమాల వేసి కేక్ కటింగ్ చేశారు. అదేవిధంగా ఎం.ఎస్.ఆర్ యూత్ డోన్ పట్టణంలో ఐటిఐ దగ్గర ఉన్నటువంటి నందమూరి తారక రామారావు, విగ్రహమునకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెస్సార్ క్యాంపు కార్యాలయంలో నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పేద ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం.పి.పి ఆర్.ఈ.రాఘవేంద్ర, సీనియర్ టిడిపి నాయకులు పోలూరు రాఘవరెడ్డి,రాష్ట్ర బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున, బేతంచేర్ల సింగిల్ విండో చైర్మన్ ఉన్నాం చంద్రశేఖర్,కొచ్చేరువు మాజీ ఎంపీటీసీ కే కే నాగన్న,సీనియర్ టిడిపి నాయకులు గంధం శ్రీనివాసులు, గండికోట రామసుబ్బయ్య, అడ్వకేట్ మధుసూధన్ గౌడ్, సీనియర్ టిడిపి నాయకులు శేషావలి చౌదరి,సీనియర్ టిడిపి నాయకులు బుగ్గనపల్లె రమేష్,సీనియర్ టిడిపి నాయకులు ఎర్రమల నాయుడు, ఉంగరానిగుండ్ల మద్దయ్య, ఉంగరానిగుండ్ల మాజీ సర్పంచ్ రాముడు, నారాయణస్వామి, నంద్యాల మధు, నాగేశ్వర రెడ్డి, చక్రపాణి గౌడ్,సిటి కేబుల్ కిరణ్, జలదుర్గం సలాం, హనుమంత రెడ్డి,హరి,అడ్వకేట్ కె.జి.చంద్రశేఖర్, అడ్వకేట్ మంగమూరి శ్రీనివాసులు,అడ్వకేట్ విజయ్ కుమార్, అడ్వకేట్ మధన గోపాల్,అడ్వకేట్ మాధవ స్వామి, అడ్వకేట్ రామచంద్రుడు, అడ్వకేట్ రామచంద్ర, కొసనపల్లె రామాంజనేయులు, సిద్దారెడ్డి,రామకృష్ణ, చనుగొండ్ల కాశీ విశ్వనాథ్ మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# రెండేళ్లలో ఊహించని అభివృద్ధి చేశాం

**కర్నూలును పారిశ్రామికంగా ముందుకు తీసుకెళుతున్నాం.**

**రెండవ రోజు మహానాడులో మంత్రి టీజీ భరత్ గుప్తా.**




కర్నూలు ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ :తమ ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఊహించని విధంగా అభివృద్ధి చేశామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. రెండవ రోజు నగరంలోని వివిధ క్లస్టర్లలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ దేశం గర్వించదగ్గ నాయకుడు అన్నారు. ఆయన అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను ఎన్నటికి మర్చిపోదని కొనియాడారు. ఇక ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో పేదలకు అన్నివిధాలా అండగా ఉంటున్నామన్నారు. పింఛన్ల పంపిణీ, తల్లికివందనం పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చుతాయన్నారు. అన్న క్యాంటిన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నట్లు తెలిపారు. కర్నూలు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. మునుపెన్నడూ లేనివిధంగా ఓర్వకల్లుకు భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదలకు ఎంతో ఉపయోగపడే కర్నూలు ప్రభుత్వాసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కర్నూలును స్మార్ట్ చేసేందుకు అహర్నిశలు కష్టపడుతున్నానన్నారు. నగరంలో ఇప్పటివరకు 850పైగా కొత్త విద్యుత్ స్తంభాలు అమర్చినట్లు చెప్పారు. 40కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చామన్నారు. సమస్య ఉందని తెలిసిన వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. గతంలో తక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై పోరాడినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వై.ఎస్ జగన్ చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలన అరాచకంగా సాగిందని, ప్రజలు మెచ్చేవిధంగా తమ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. పుట్టినరోజులకు సేవా కార్యక్రమాలు చేసే సంస్కృతి తమదైతే.. రోడ్లపై ఫ్లెక్సీలకు పొట్టేళ్ల రక్తం చిందించేది వైసీపీ నైజం అన్నారు. వైసీపీ విధానాలు ప్రజలందరికీ అర్థమవుతున్నాయన్నారు.


# రెండేళ్లలో ఊహించని అభివృద్ధి చేశాం



కర్నూలును పారిశ్రామికంగా ముందుకు తీసుకెళుతున్నాం.

రెండవ రోజు మహానాడులో మంత్రి టీజీ భరత్ గుప్తా.





కర్నూలు ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ :తమ ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఊహించని విధంగా అభివృద్ధి చేశామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. రెండవ రోజు నగరంలోని వివిధ క్లస్టర్లలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ దేశం గర్వించదగ్గ నాయకుడు అన్నారు. ఆయన అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను ఎన్నటికి మర్చిపోదని కొనియాడారు. ఇక ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో పేదలకు అన్నివిధాలా అండగా ఉంటున్నామన్నారు. పింఛన్ల పంపిణీ, తల్లికివందనం పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చుతాయన్నారు. అన్న క్యాంటిన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నట్లు తెలిపారు. కర్నూలు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. మునుపెన్నడూ లేనివిధంగా ఓర్వకల్లుకు భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదలకు ఎంతో ఉపయోగపడే కర్నూలు ప్రభుత్వాసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కర్నూలును స్మార్ట్ చేసేందుకు అహర్నిశలు కష్టపడుతున్నానన్నారు. నగరంలో ఇప్పటివరకు 850పైగా కొత్త విద్యుత్ స్తంభాలు అమర్చినట్లు చెప్పారు. 40కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చామన్నారు. సమస్య ఉందని తెలిసిన వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. గతంలో తక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై పోరాడినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వై.ఎస్ జగన్ చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలన అరాచకంగా సాగిందని, ప్రజలు మెచ్చేవిధంగా తమ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. పుట్టినరోజులకు సేవా కార్యక్రమాలు చేసే సంస్కృతి తమదైతే.. రోడ్లపై ఫ్లెక్సీలకు పొట్టేళ్ల రక్తం చిందించేది వైసీపీ నైజం అన్నారు. వైసీపీ విధానాలు ప్రజలందరికీ అర్థమవుతున్నాయన్నారు.


# స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం విజయ ఢంకా మోగించాలి








**ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్**

వెల్దుర్తి మే 28 యువతరం న్యూస్: స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం విజయ ఢంకా మోగించాలని ఎమ్మెల్యే కె.ఈ. శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం వెల్దుర్తి మండలం లోని 10వ క్లస్టర్ అయిన గోవర్ధనగిరి గ్రామంలో జరిగిన మహానాడు రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట పత్తికొండ అబ్జర్వర్ పోలన్న పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాలు ఎంత ఉత్సాహంగా జరుపుకుంటున్నాము అంతే ఉత్సాహంతో ఎన్నికలలో విజయాలు సాధించాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపిని నామరూపాలు లేకుండా ఓడించాలన్నారు. చంద్రబాబు నాయుడు మనపై ఉంచిన నమ్మకాన్ని మనము నిజం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పుల్లయ్య, బాబు గౌడ్,శశి, రామచంద్రుడు,వెంకటరాముడు, శ్రీనివాసులు, చౌదరి, కృష్ణ, రాముడు, శేఖర్, రమేష్, రాజేష్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహానాయకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన..

**సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్.**





కర్నూలు ప్రతినిధి మే 28 యువతరం న్యూస్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు.. మహానాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా గురువారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మే 28వ తేదీని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ మాట్లాడుతూ...తెలుగు ప్రజల గౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహానాయకుడు ఎన్టీఆర్ ప్రజాహిత పరిపాలనకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలకు అందించిన సేవలు, ఆయన పరిపాలనా దక్షత, తెలుగు సమాజానికి చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో హోంగార్డు డిఎస్పీ ప్రసాద్, ఆర్ ఐలు నారాయణ, పోతల రాజు, ఆర్ ఎస్సైలు , ఎఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవ రోజు ఘనంగా నిర్వహించిన పసుపు పండగ...

**ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన టిడిపి నేతలు, కార్యకర్తలు....**



తుగ్గలి మే 28(యువతరం న్యూస్ ): తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైబల్ అడ్వైజర్ మెంబెర్ పి.వెంకటపతి,టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు,మాజీ సర్పంచ్ మసాలా శ్రీను,మాజీ సర్పంచ్ బర్మా వీరేష్,ఈశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాంపల్లి కాశిరెడ్డి నాయన దేవస్థానం ఆవరణంలో మహానాడు వేడుకను పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ టీడీపీ నేతలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది.అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 'ఆత్మగౌరవాన్ని' పరిచయం చేసిన ధీరుడు ఎన్టీఆర్ అని,రాజకీయ రంగంలో ధృవతారగా వెలిగారన్నారు.పార్టీ కష్టకాలంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీని కాపాడి 44 ఏళ్లుగా బలోపేతంగా ముందుకు తీసుకెళ్తున్నారు అని వారు పేర్కొన్నారు.చంద్రబాబు, లోకేష్ లు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తోందని అన్నారు.యువగళం ద్వారా లోకేష్ మూడో తరం నాయకత్వాన్ని నిరూపించుకుని పార్టీని విజయపథంలో నడిపిస్తున్నారని టీడీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్తూరు చక్రపాణి,శివరాముడు, కొమ్ము వెంకటేష్,ప్రతాప్ యాదవ్, రాంపల్లి శ్రీనివాసులు,బత్తిన దేవేంద్ర,రాజేంద్ర గౌడ్, కోటేష్ గౌడ్, అక్బర్ బాషా,మోహన్, సోమశేఖర్ గౌడ్,డాక్టర్ చంద్ర,చిన్న పెద్దయ్య,చిన్న బొజ్జన్న,ముక్కెళ్ళ బాలు,చంద్ర మోహన్,పగిడిరాయి రాము,నక్కల రమేష్, నారాయణ గౌడ్, డీలర్ రంగస్వామి,మొట్టి సంజ్జన్న, మట్టి గుండమయ్య,ఎల్లా గౌడ్,నాగరాజు,హేమాద్రి నాయుడు,నారాయణ, ప్రసాద్, హరి,కవేంద్ర,రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాయిల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష ఈ జ్యూస్..! రోజుకో గ్లాసుడు తాగారంటే చిక్కులన్నీ పరార్..



బీట్‌రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బీట్‌రూట్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, భాస్వరం ఉండటం వల్ల ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ముఖ్యంగా బీట్‌రూట్ మహిళల ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా ఉపకరిస్తుంది. ఇందులోని పోషకాలు..

బీట్‌రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బీట్‌రూట్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, భాస్వరం ఉండటం వల్ల ఇది ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ముఖ్యంగా బీట్‌రూట్ మహిళల ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.

రక్త పరిమాణాన్ని పెంచడంలో సహాయపడుతుంది. బీట్‌రూట్‌లో ఐరన్ మహిళల్లో రక్తహీనతను తొలగించడంలో భలేగా పని చేస్తుంది. హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. బీట్‌రూట్‌లోని యాంటీఆక్సిడెంట్లు, పోషకాలు మహిళల్లో హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడతాయి.

2 / 5

పీరియడ్స్ సమయంలో నొప్పిని తగ్గిస్తుంది. బీట్‌రూట్‌లోని శోథ నిరోధక లక్షణాలు ఈ సమయంలో సంభవించే కడుపు నొప్పి, వాపును తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో నైట్రేట్లు కూడా ఉంటాయి. ఇవి శరీరంలో రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. అలసట నుంచి ఉపశమనం కలిగిస్తాయి. శక్తిని పెంచుతాయి.

బీట్‌రూట్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులోని పోషకాలు రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బీట్‌రూట్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

## పసుపు పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

### వ్యవసాయ విస్తీర్ణాధికారి ఎం. నారాయణ



ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు పంటలో పసుపు పంటకు (Turmeric Crop) దుంప కుళ్లు, తాటాకు మచ్చ తెగులు ఆశిస్తోందని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఎం. నారాయణ (AEO Narayana) పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని జంగం పార్డి (కే) తదితర గ్రామాల్లో పంటలు సాగు చేసిన వ్యవసాయ క్షేత్రాలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. పసుపు పంట ఆకులపై అక్కడక్కడా పెద్ద మచ్చలు ఏర్పడడంతో పాటు ముదురు గోధుమ రంగులోని మచ్చల చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుందన్నారు. రైతులు పసుపు పంటలు సస్యరక్షణ చర్యలను చేపట్టడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాల వల్ల పసుపు పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. ఈ తెగుళ్ల నివారణకు మచ్చలు ఉన్న, ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలని పేర్కొన్నారు. లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండజిం లేదా 2.5 గ్రాముల మాంకోజెట్, 0.5 మి.లీ. సబ్బు నీరు లేదా ఒక గ్రామ్ థయోఫానేట్ మిథైల్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. ఇనుప ధాతు లోపం భూమిలో చౌడు, సున్నం, భాస్వరం ఎక్కువగా, సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న భూముల్లో ఇనుప ధాతులోపం కనిపిస్తుందన్నారు. దీనివల్ల ఆకులు తెల్లగా మారుతాయి. ఆకు పరిమాణం తగ్గి అంచుల కణజాలం దెబ్బతింటుంది. పంట చేతికొచ్చే సమయంలో దుంపలు, కొమ్ములు చిన్నవిగా తయారై నాణ్యత లోపిస్తుందని తెలిపారు. దీని నివారణకు మడిలో మురుగునీరు పోయే సౌకర్యం కల్పించడంతో పాటు లీటరు నీటిలో 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ లేదా 10 గ్రాముల అన్నభేది, ఒక గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పైరుపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు రైతుల సోయా, పత్తి క్షేత్రాలను పరిశీలించి తగు సూచనలు సలహాలను అందజేశారు. ఆయా గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఆన్‌లైన్లో నమోదు చేశారు.

## బాత్‌రూమ్‌లో కూర్చొని రీల్స్ స్క్రోల్ చేస్తున్నారా?.. వెంటనే ఆపలేదో.. మీ బాడీ షెడ్డుకే!



సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఫోన్‌లకే అతుక్కుపోతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేదాకా.. సోషల్ మీడియా ప్రపంచంలోనే బ్రతికేస్తున్నారు. కొంతమందైతే బాత్‌రూమ్‌లోనూ ఫోన్ చూస్తూ గంటల తరబడి కూర్చుంటున్నారు. కానీ ఇలా ఎక్కువ సమయం బాత్రూమ్‌లో రీల్స్ చూస్తూ ఉడడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవెంటో ఇక్కడ తెలుసుకుందాం. టెక్నాలజీ రోజురోజుకూ పెరుగుతోంది. మన జీవనశైలి కూడా అంతే. స్మార్ట్‌ఫోన్‌లు జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయి. కొంతమందైతే బాత్‌రూమ్‌లోనూ ఫోన్ చూస్తూ గంటల తరబడి కూర్చుంటున్నారు. ఈ అలవాటు చాలా మందికి రోజువారీ దినచర్యగా మారింది. ఇప్పుడు ఈ అలవాటు పెద్ద ప్రభావం చూపకపోయినా.. కాలక్రమేణా, తీవ్రమైన ఆరోగ్య పరిణామాలను కలిగిస్తుంది. ఇది మీ ప్రేగుల ఆరోగ్యాన్ని నాశనం చేయడమే కాకుండా హేమోరాయిడ్ల ప్రమాదాన్ని పెంచుతుంది. టాయిలెట్‌లో మీరు ఫోన్‌ను ఉపయోగించడం వల్ల ఇంకా ఎలాంటి సమస్యలు వస్తాయో చూద్దాం.

ఎయిమ్స్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్‌లలో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి ప్రకారం.. టాయిలెట్‌లో కూర్చుని స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించే వారికి హెమోరాయిడ్స్ వచ్చే అవకాశం 46% ఎక్కువగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఇందుకు ప్రదాన కారణం ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడమే అంటున్నారు నిపుణులు. అధిక పీడనం వల్ల మలద్వారం, పురీషనాళంలోని సిరల్లో వాపు వస్తుందని.. ఇది మూలవ్యాధికి వచ్చే అవకాశాన్ని పెంచుతుందని ఆయన తెలిపారు. ఆహారం, వయస్సు, బరువు, శారీరక శ్రమ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా, టాయిలెట్‌లో కూర్చుని ఫోన్ ఉపయోగించడం వల్ల మూలవ్యాధి ప్రమాదంపై బలమైన ప్రభావం చూపుతుందని పరిశోధకులు చెబుతున్నారు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులలో దాదాపు 37 శాతం మంది ఐదు నిమిషాల కంటే ఎక్కువ సమయం టాయిలెట్‌లో గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఐదు నిమిషాలు అంతగా అనిపించకపోవచ్చు, కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల అనేక మన శరీరంలోని అనే భాగాలపై నిరంతరం ఒత్తిడి పడుతుంది. ఇది కాలక్రమేనా అలవాటుగా మారినప్పుడు, అది క్రమంగా పురీషనాళంలోని సిరలను బలహీనపరుస్తుంది. మలవిసర్జన సమయంలో ఒత్తిడికి గురికావడం అనేది మూలవ్యాధికి ఒక సాధారణ కారణమని మనని ఆయన చెబుతున్నారు. అలాగే, ఎక్కువసేపు టాయిలెట్‌లో కూర్చోవడం వల్ల రక్త ప్రసరణ దెబ్బతింటుంది, ముఖ్యంగా కాళ్లలో. డీప్ వెయిన్ థ్రాంబోసిస్ లేదా ఇప్పటికే ఉన్న ప్రసరణ సమస్యలు మరింత తీవ్రమవడానికి ఇది ఒక ప్రధాన అంశం. కాబట్టి మీరు బాత్రూంలో ఎక్కువ సమయం గడుపుతున్నట్టు అయితే వెంటనే ఈ అలావాటును మానుకోండి.

## వాషింగ్ మెషిన్ నుంచి దుర్వాసన వస్తుందా? ఖర్చు లేని చిట్కా..



వాషింగ్ మెషిన్ అనేది ఇప్పుడు మన దైనందిన జీవితంలో ఒక భాగం. అయితే, కొన్నిసార్లు అందులో నుంచి వచ్చే దుర్వాసన మన దుస్తులకూ అంటుకుని ఇబ్బంది పెడుతుంది. దీనిని వదిలించుకోవడానికి చాలామంది రసాయన ఆధారిత క్లీనర్లను ఉపయోగిస్తారు. కానీ, మన ఇంట్లో దొరికే కేవలం రెండు సాధారణ వస్తువులతో ఈ సమస్యను సులభంగా పరిష్కరించుకోవచ్చు. అవేంటో చూద్దాం.. నేడు చాలా ఇళ్లలో వాషింగ్ మెషిన్ ఒక ముఖ్యమైన వస్తువుగా మారిపోయింది. ప్రతి వారం 3-4 సార్లు దీనిని ఉపయోగిస్తాం. తరచుగా శుభ్రం చేయకపోతే లేదా వాడే నీరు శుభ్రంగా లేకపోతే దీనిలో దుర్వాసన వస్తుంది. ఆ వాసన దుస్తులకు కూడా అంటుకుంటుంది. ఈ పరిస్థితిని నివారించడానికి వాషింగ్ మెషిన్‌ను శుభ్రం చేయడం అవసరం. దీనికి ఎక్కువ ఖర్చు పెట్టాల్సిన పని లేదు. కొన్ని సులభమైన చిట్కాలతో ఈ సమస్యను పరిష్కరించవచ్చు.

**కావాల్సిన వస్తువులు:** పటిక 1 ముక్క, నిమ్మకాయ తొక్కలు 4, నీరు 2 లీటర్లు.

**తయారీ విధానం:**

ముందుగా, 2 లీటర్ల నీటిని బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, పటికను పొడి చేసి అందులో కలపాలి. నిమ్మకాయ తొక్కలు కూడా అందులో వేయాలి. ఈ మిశ్రమాన్ని 15 నిమిషాల పాటు మరిగించాలి. నీరు సువాసన వస్తున్నప్పుడు స్టవ్ ఆపివేసి, 15 నిమిషాలు మూతపెట్టి అలాగే ఉంచాలి. ఆ తర్వాత, ఆ ద్రావణాన్ని డిటర్జెంట్ పోసే చోట, మిగిలిన దానిని వాషింగ్ మెషిన్ డ్రమ్ లోపల పోయాలి. డ్రమ్‌లో ఎలాంటి దుస్తులు ఉండకూడదు. మెషిన్‌ను 15-20 నిమిషాల పాటు నడిపించాలి. ఆ నీరు డ్రమ్‌లో ఉన్న మురికిని శుభ్రం చేస్తుంది. ఆ నీరు పూర్తిగా బయటకు వెళ్ళిన తర్వాత, మళ్ళీ 15 నిమిషాలు మంచి నీటితో మెషిన్‌ను నడిపించాలి. పూర్తయిన తర్వాత, మెషిన్‌ను ఆపివేసి, డోర్ తెరిచి గాలి తగిలేలా ఉంచాలి. డ్రమ్ ఆరిపోయిన తర్వాత, దుర్వాసన పూర్తిగా పోతుంది.

**ఈ టిప్స్ పాటించండి..**

వాషింగ్ మెషిన్ ఎక్కువ కాలం తాజాగా, శుభ్రంగా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. ప్రతి వాష్ తర్వాత మెషిన్ డోర్‌ను కాసేపు తెరిచి ఉంచాలి. దీనివల్ల లోపల తేమ ఆరిపోయి, దుర్వాసన రాకుండా ఉంటుంది.

## మహానాడు సందర్భంగా తెలుగుదేశం నాయకులకు సన్మానం
























వెల్దుర్తి మే 28 యువతరం న్యూస్: మహానాడు రెండో రోజు సందర్భంగా మండల కేంద్రమైన వెల్దుర్తి లోని కొత్త బస్టాండ్ సమీపంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం 9వ క్లస్టర్ లో తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మొదట తెలుగుదేశం సృష్టికర్త నడురత్న ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా నాయకులు ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా నాయకులు బొమ్మిరెడ్డి పల్లె సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్, లక్ష్మి రెడ్డి, రామాంజనేయులు,మండల తెదేపా అధ్యక్షులు బలరాం గౌడ్, తెలుగు యువత అధ్యక్షులు సుధాకర్ గౌడ్, కోపరేటివ్ సొసైటీ చైర్మన్ రమాకాంత్ రెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఐజయ్య, వీరభద్రుడు, బజారు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రలో నీరాజనాలు.. తెలంగాణలో నిందలు!

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి దాదాపు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్తూరు జిల్లా కుప్పంలోని పరమసముద్రం చెరువును కృష్ణా జలాలతో నింపుతున్న వీడియోలను ఇటీవల చూసినప్పుడు మనసుకు ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. ఏ రైతుకైనా లేదా వ్యవసాయంతో అనుబంధమున్న ఎవరికైనా సరే ఈ దృశ్యాలు అమితానందాన్నిస్తాయి. అంతేకాదు, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదనే భరోసా కలిగిస్తాయి. ప్రాంతంతో సంబంధం లేకుండా తెలంగాణ సరిహద్దుల నుంచి తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో బీడువారిన గ్రామాల్లోని చెరువులను నింపుతూ నీళ్లు ఇంత దూరం ప్రయాణించడం ఒక మధుర ఘట్టమనే చెప్పాలి. ఈ ప్రయాణంలో కృష్ణా జలాలు మార్గమధ్యంలో అనేక జలాశయాలను నింపుతూ, కరువు ప్రభావిత రాయలసీమకు జీవం పోస్తాయి. భారతదేశ సైన్స్, టెక్నాలజీ రంగాలు, ప్రపంచ దౌత్యపరంగా గణనీయమైన పురోగతి సాధిస్తున్న ప్రస్తుత రోజుల్లోనూ వ్యవసాయానికి నీళ్లను అందించడం సాధ్యంకాని కలగానే మిగిలిపోయింది. అంతేకాదు, రైతులను పాలకులు ప్రకృతి అస్థిరతలకు వదిలేశారు. అయితే గత రెండు మూడు దశాబ్దాలను పరిశీలిస్తే, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నీటిని ఉపయోగించడం లేదా మళ్లించడంలో గణనీయమైన పురోగతి కనిపిస్తున్నది. తెలంగాణలో నీటిపారుదల రంగాభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ చర్యలు ఆలస్యంగా రాష్ట్ర విభజన తర్వాత ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ, 2014-2023 మధ్యకాలంలో వేగం పుంజుకోవడమే కాదుబీ గోదావరి, కృష్ణా నీటిని గొప్పగా ఉపయోగించడంలో అత్యద్భుతమైన ఫలితాలను సాధించారు.

నీటిపారుదలరంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలకు సంబంధించిన లెక్కల గురించి కాదు ఈ వ్యాసం. సోషల్ మీడియా, ప్రధాన తెలుగు మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్) సహాయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని నీటిపారుదల పథకాలపై వ్యాప్తి చేసిన, చేస్తున్న విరుద్ధమైన కథనాల గురించి వివరించి చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం. తెలంగాణలోని రైతులు, పరిశీలకుల మెదళ్లలో శాశ్వతంగా నిలిచిపోయేవి ఈ విరుద్ధ కథనాలే. ఉదాహరణకు కృష్ణా నీళ్లతో కుప్పం ప్రాంతంలోని చెరువులను నింపడం పట్ల ఏపీలో



విజయోత్సవాలు చేసుకున్నారు. దీనిపై విస్తృత ప్రచారం జరిగింది. రైతుల్లో ఉత్సాహం, అక్కడి అధికార పార్టీ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని కలిగించింది ఈ ఘటన. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వార్త ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికే పరిమితమైంది. తెలంగాణ రైతులు, ముఖ్యంగా ప్రజలకు ఈ విషయం గురించి కనీస అవగాహన కూడా లేదు. తెలంగాణ వార్తాపత్రికల్లో ఈ వార్తను ప్రచురించకపోవడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ దృశ్యాలను చూపించకపోవడమే అందుకు కారణం. దీని వెనుక తెలంగాణ ప్రజలకు తెలియని పలు కారణాలున్నాయి. ఇందుకు విరుద్ధంగా 2023కు ముందు తెలంగాణలో ఇలాంటి అద్భుతమైన మైలురాళ్ల గురించిన వార్తలు ఈర్ష్యతోనూ, సాధ్యాసాధ్యాలపై అనుమానాలతోనూ, అసలు ఇలాంటివి అవసరమా? అనే సందేహాలతోనూ ప్రచురితమయ్యాయి. సాగునీళ్లు అన్ని ప్రాంతాల రైతులకు జీవనాడి అయినప్పుడు ఏపీలో ఎందుకు 'జలహారతి' ఇస్తూ ఉత్సవాలు చేసుకుంటున్నారు? తెలంగాణలో ఎందుకు నిందలు వేస్తున్నారు? వ్యయం-ప్రయోజనాల విశ్లేషణ, విద్యుత్ భారం, నదీ బేసిన్ల వెలుపల నీటిని మళ్లించడం, సంబంధిత చట్టాలు లాంటి ప్రశ్నలను ఏపీ విషయంలో చాలా అరుదుగా లేవనెత్తుతారు. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం రైతుల ప్రయోజనాలను విస్మరించేందుకు కూడా సాహసిస్తున్నారు. అధికారంలో ఉన్నవారిపై ఆరోపణలు చేయడం, సర్కారుపై నిందలు వేయడం మొదలుకొని వాతావరణ మార్పుల వరకు వివిధ రకాల కథనాలను ఎలాంటి తడబాటు లేకుండా వ్యాప్తి చేస్తున్నారు.

తెలంగాణలో మీడియా కథనాల్లో సాగు విస్తీర్ణం, వరి సాగు వల్ల కార్బన్ ఉద్గారాల విడుదల గురించిన ఆందోళనలు, ఎకరం పంట పండించేందుకు అధిక సాగునీటి ఖర్చు, నీళ్లను ఎత్తిపోసేందుకు అత్యధిక విద్యుత్తు వ్యయం లాంటి అంశాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఈ కథనాలు చివరికి వరిపై ఎక్కువ నీళ్లను వాడే పంటగా ముద్రవేసేంత వరకు, వరి సాగును తగ్గించాలని సూచించేంత వరకు వెళ్లాయి రాష్ట్ర విభజన జరగకపోయి ఉంటే, తెలంగాణ రైతులకు వ్యవసాయం చేయడం తెలియదని, అందువల్ల వారికి సాగునీరు అవసరం లేదని సూచించే స్థాయికీ ఈ కథనాలు వెళ్లేవి. కానీ, వాస్తవానికి ఐదేండ్లలోనే వడ్ల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లిన తెలంగాణ రైతుల సామర్థ్యాన్ని ఈ ప్రపంచం చూసింది. నిజానికి తెలంగాణ రైతులు వరి సాగు చేయకుండా నిరుత్సాహపరచాలని కొంతమంది మేధావులుగా చెప్పుకొనేవారు ప్రయత్నించారు. డయాబెటిస్ కారణంగా ప్రజలు అన్నం తినడం లేదని, అందువల్ల తెలంగాణ రైతులకు సాగునీరు అందించే ప్రయత్నాలు అనవసరమని ప్రచారం చేశారు. ప్రధాన మీడియా సంస్థల మద్దతు ఉంటే ఎలాంటి నెరేటివ్‌ను అయినా సులువుగా ప్రచారం చేయవచ్చని అనడానికి ఇదే నిదర్శనం. పండించిన ధాన్యాన్ని పూర్తిగా వినియోగించే ఇతర మార్గాలను ప్రభుత్వం వెతకాలే తప్ప, వరి సాగు చేయవద్దని చెప్తారా? అని తెలంగాణ రైతులు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. పప్పు, కూరగాయలు, పండ్ల వంటి పంటలకూ వరికి ఇచ్చినట్టే మద్దతిస్తే, రైతులు ఇతర పంటలు పండించేందుకు సంకోచించరు.

ఇక అసలు విషయానికి వస్తే, ఏపీలో సాగునీటి కోసం అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, తొలి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలకు మధ్య వ్యత్యాసాలేమీ లేవు. ఈ రెండు రాష్ట్రాలు కరువు పీడిత ప్రాంతాలకు నీళ్లను తీసుకెళ్లేందుకు కష్టపడుతున్నాయి. అయితే, ఈ సారూప్యత ఇక్కడితోనే ముగుస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రైతులు మూడు కీలకమైన అంశాలను లేవనెత్తుతున్నారు. మొదటిది, తమ రాష్ట్రంలోని ప్రాజెక్టుల కోసం శ్రీశైలం జలాశయం నుంచి 'వరద లేదా మిగులు' జలాలను ఉపయోగిస్తున్నామని ఏపీ చెప్తున్నది. కానీ, తెలంగాణ రైతులు ఈ వాదనను ఖండిస్తున్నారు.




వీర ధీర శూర ట్రైలర్ చూస్తే విక్రమ్ లోని మాస్ ని డైరెక్టర్ పర్ఫెక్ట్ గా వాడుకున్నట్టు ఉన్నాడని అనిపిస్తుంది. చియాన్ విక్రమ్ హీరోగా అరుణ్ కుమార్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా వీర ధీర శూర. హెచ్.ఆర్ పిక్చర్స్, రియా శిబు నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్ ఈమధ్యనే రిలీజై

# విక్రమ్ వీర ధీర శూర ట్రైలర్ టాక్..!

ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇక లేటెస్ట్ గా ఈ సినిమా ట్రైలర్ ని రిలీజ్ చేశారు చిత్రయూనిట్. వీర ధీర శూర ట్రైలర్ చూస్తే విక్రమ్ లోని మాస్ ని డైరెక్టర్ పర్ఫెక్ట్ గా వాడుకున్నట్టు ఉన్నాడని అనిపిస్తుంది. ఓ పక్క జాతర జరుగుతుంటే కొంతమంది కోసం పోలీసులు వెతుకుంతుంటారు.. ఈలోగా కాళీ రంగంలోకి దిగుతాడు. ఇంతకీ కాళీ ఎవరు అతను ఏం చేశాడన్నది సినిమా కథ. ట్రైలర్ లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ముందు చెప్పినట్టు విక్రమ్ లోని ఊర మాస్ యాంగిల్ ని డైరెక్ట్ పర్ఫెక్ట్ గా ఎగ్జిక్యూట్ చేసినట్టుగా అనిపిస్తుంది. సినిమాకు అంతా సెటప్ బాగుంది. ట్రైలర్ కట్ ఆసక్తి కలిగేలా చేశారు. విక్రమ్ ఫ్యాన్స్ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మాస్ బొమ్మగా వీర ధీర శూర ఉండబోతుందని అనిపిస్తుంది. సినిమాలో విజువల్స్ కి తగిన బిజిఎం ఇంక విక్రమ్ తో పాటు ఎస్.జె సూర్య నటన అన్నీ కూడా బాగా కుదిరినట్టే అనిపిస్తున్నాయి. ఇంతకీ ఈ కాళీ ఎవరు ఏం చేస్తాడ్.. పోలీసులతో అతని ఫైట్ ఏంటి.. కాళీ చేసే మాస్ జాతర ఎలా ఉంటుంది అన్నది తెలియాలంటే మార్చి 27 వరకు వెయిట్ చేయాల్సిందే. తన ప్రతి సినిమాతో ప్రయోగాలు చేస్తూ ప్రేక్షకులను అలరించాలని చూసే విక్రమ్ ఇప్పుడు ఒక పక్కా మాస్ సినిమా వీర ధీర శూర తో వస్తున్నాడు. హీరోయిన్లను ఒకలా చూస్తారు ఈ సినిమాను ముందు పార్ట్ 2 వదులుతున్నారు అంటేనే సినిమా మీద వీళ్లకున్న నమ్మకం ఎలాంటిదో అర్థమవుతుంది. విక్రం వీర ధీర శూర పార్ట్ 2 ని తెలుగులో ఎన్.వి.ఆర్ సినిమాస్ వాళ్లు రిలీజ్ చేస్తున్నారు. నెక్స్ట్ వీకెండ్ లో చాలా సినిమాలు రిలీజ్ ఉండగా రేసులో విక్రం వీర ధీర శూర కూడా మంచి కంటెంట్ తోనే వస్తుందని ఈ ట్రైలర్ చూస్తేనే అర్థమవుతుంది. విక్రమ్ వీర ధీర శూర ఈసారి పక్కా ప్లానింగ్ తో వస్తున్నట్టు అర్థమవుతుంది. తను చేసే సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సరే ప్రయత్న లోపం లేకుండా కష్టపడుతున్న చియాన్ విక్రమ్ కు ఒక సూపర్ హిట్ సినిమాగా వీర ధీర శూర నిలుస్తుందా లేదా అన్నది మరికొద్ది రోజుల్లో తెలుస్తుంది.

# ఓదెల 2.. అదృష్టం ఉంటేనే ఇలాంటి సినిమాలు..!

సంపత్ నంది ప్రొడక్షన్ లో వచ్చిన ఓదెల రైల్వేస్టేషన్ ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్ గా ఓదెల 2 వస్తుంది. తమన్నా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ నటిస్తున్న ఈ సినిమాను మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్ లో మధు నిర్మిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్ ని ఏప్రిల్ 17 న అనౌన్స్ చేశారు. ఈ క్రమంలో జరిగిన ప్రెస్ మీట్ లో సినిమా గురించి మరిన్ని విషయాలు పెంచుకున్నారు.ఈ ఈవెంట్ లో పాల్గొన్న తమన్నా సంపత్ గారితో 4 సినిమాలు చేశాను. రచ్చ టైం లోనే ఒక సినిమాలో స్క్రీన్ ప్లే ఎలా ఉంటుందో ఆయన దగ్గర పనిచేశాక తెలిసింది. ఆయనతో సినిమాలు చేయడం ఆయనతో మాట్లాడటం వల్లే తన కెరీర్ లో మంచి సినిమాలు చేశానని అన్నారు తమన్నా.రచ సినిమా ముంబైలో ఫ్యామిలీతో చూశాం. ఆ సినిమా అందరికీ అర్థమైంది. బాష అర్థం కాకపోయినా సినిమా ఏం చెబుతుందో వాళ్లకు అర్థమవుతుందని అన్నారు తమన్నా. ఈ సినిమాకు మేమంతా కలిసి పనిచేశాం. మాకు ఎలాంటి టైటిల్స్ లేవు. అందరం అన్ని పనులు చేశాం. మేమంతా కలిసి చేసిన సినిమా ఇది. ఈ సినిమా నుంచి కూడా నేను చాలా విషయాలు నేర్చుకున్నా అన్నారు తమన్నా.ఒక దర్శకుడు నమ్మితేనే ఒక హీరోయిన్ కి ఇలాంటి సినిమాలు వస్తాయని అన్నారు. ఇక సినిమా చేసే టైం లో చాలాసార్లు కెమెరా ముందు ఏదో చేసి మోనిటర్ లో చూస్తే మరోలా కనిపించేది. మాతో పాటు ఒక స్పెషల్ వైబ్ ఈ సినిమాకు అనిపించింది. ఇలాంటి సినిమాలో జర్నీ చేస్తానని నేను అనుకోలేదని అన్నారు తమన్నా.డైరెక్టర్ అశోక్ తేజ ఓదెల ని అద్భుతంగా తీశారు. అది చూసినప్పుడే పార్ట్ 2 ఉండాలని అనుకున్నా సంపత్ నంది పార్ట్ 2 ఐడియా చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇది అంత ఈజీ జోనర్ కాదని అన్నారు తమన్నా. ఒక పల్లెటూరి కథను ఇంత ఎగ్జైటిన్ గా చెప్పడం అంత సామాన్యమైన విషయం కాదు. నేను ఏ సినిమా చేసినా ఆడియన్స్ కు ఒక కొత్త ఎక్స్ పీరియన్స్ ఉండాలని కోరుకుంటా.. అలాంటి కొత్త ఎక్స్ పీరియన్స్ ఇచ్చే సినిమా ఓదెల 2 అని అన్నారు తమన్నా.సినిమాలో భైరవి క్యారెక్టర్ చేయడం యాక్టర్ గా అదృష్టంగా భావిస్తున్నా. నా కెరీర్ లో హైయెస్ట్ క్లోజప్ ఉన్న సినిమా ఇదే. భైరవీ క్యారెక్టర్ నేచురల్, మ్యూజికల్ గా చూపించడం నిజంగానే పెద్ద ఛాలెంజ్ అని అన్నారు తమన్నా.








# యష్ టాక్సిక్ వేట మొదలయ్యేది ఎప్పుడంటే..

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా క్రేజ్ అందుకున్న రాకింగ్ స్టార్ యష్ ఇప్పుడు గ్లోబల్ ఆడియెన్స్‌ను లక్ష్యంగా పెట్టుకుని అడుగులు వేస్తున్నారు. 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్' అనే విభిన్న శైలి టైటిల్‌తో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా రిలీజ్ డేట్ ఖరారు చేశారు. కేవలం యష్ అభిమానులకే కాకుండా ఇండియన్ సినిమాపై ఆసక్తి ఉన్న ప్రేక్షకులందరికీ ఇది ఒక ఇంట్రస్టింగ్ అప్‌డేట్‌గా నిలిచింది.ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ మాత్రం ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. భారీ వర్షంలో నలిగిపోయిన లుక్‌తో, చేతిలో గన్ పట్టుకుని నడుస్తున్న యష్ పాత్ర పవర్ఫుల్ గా కనిపిస్తోంది. విపరీతమైన అగ్నికీలలు, మంటలు కనిపిస్తుండగా.. యష్ శరీరాకృతిలో ఉన్న షాడో అలానే స్పష్టంగా నిలిచింది. 2026 మార్చి 19న సినిమా థియేటర్లలోకి రానుందని పోస్టర్ ద్వారా అధికారికంగా వెల్లడించారు. ఉగాది, ఈద్ వంటి పండుగల వారం కావడంతో అదే వారం విండోలో బాక్సాఫీస్ రేంజ్ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.ఈ సినిమాను గీతు మోహన్‌దాస్ అనే ప్రఖ్యాత దర్శకురాలు తెరకెక్కిస్తుండగా, %ఖఎచీ% ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు, కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తుండగా, నయనతార, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ కాంబినేషన్‌నే చూసినా సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో మాత్రమే కాకుండా ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌తో ఉండబోతోందని అర్థమవుతోంది. ముంబై నుంచి మలయాళం, తమిళం వరకు ఫేమస్ నటీనటుల బలంతో భారీ స్థాయిలో క్యాస్టింగ్ ఫిక్స్ చేశారు.1970ల గోవా కర్ణాటక బ్యాక్‌డ్రాప్‌లో బ్రదర్ సిస్టర్ ఎమోషనల్ డ్రామాతో సాగనున్న ఈ కథకు హాలీవుడ్ టచ్ కూడా ఉండనుంది. ప్రముఖ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ యాక్షన్ పార్ట్ డిజైన్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని అధికారికంగా మేకర్స్ కూడా తెలియజేశారు. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఒకేసారి షూటింగ్ జరిపే ఈ సినిమా, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో కూడా విడుదల కానుంది. ఇదే మాస్ ప్లస్ అవుతుందన్న అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో స్పష్టంగా వినిపిస్తోంది.మొత్తానికి 'టాక్సిక్' అనే టైటిల్ వినగానే విభిన్నత ఊహించగలిగిన ప్రేక్షకులకు, ఈ పోస్టర్, ఈ రిలీజ్ డేట్ తో మరింత ఆసక్తిని కలిగించింది. యష్ మాస్ పరాకాష్టగా కనిపించే ఈ సినిమా వచ్చే ఏడాది మార్చిలో ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి. కేజీఎఫ్ తరువాత యష్‌కి మళ్లీ అదే స్థాయి మార్కెట్ రిపీట్ అవుతుందా అన్నది ఆసక్తికర అంశం కానుంది.

# రెండేళ్లైనా సమంతకు ప్రేమ తగ్గలేదు



ఏ మాయ చేసావే సినిమాతో విపరీతమైన ఫ్యాన్స్ ను సంపాదించుకుంది సమంత. తక్కువ టైమ్ లోనే సౌత్ లోని అగ్ర హీరోలందరితో నటించి స్టార్ హీరోయిన్ గా మారిన సమంత, కెరీర్ పీక్ లో ఉన్నప్పుడే నాగచైతన్య ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ తర్వాత ఇద్దరికీ మనస్పర్థలు రావడంతో పరస్పర అంగీకారంతో విడిపోయారు.ఆ తర్వాత సమంతకు ఆరోగ్యం క్షీణించి మయోసైటిస్ అనే వ్యాధితో బాధ పడటం, ఆ వ్యాధి చికిత్స నిమిత్తం కొంత కాలం పాటూ సినిమా నుంచి బ్రేక్ తీసుకున్న సమంత ఇప్పుడు మళ్లీ తన సినిమాల వేగాన్ని పెంచుతోంది. రీసెంట్ గా అమెజాన్ ప్రైమ్ కోసం వరుణ్ ధావన్ తో కలిసి సమంత సిటాడెల్ హనీ బన్నీ చేసి మంచి రెస్పాన్స్ అందుకున్న విషయం తెలిసిందే.వెబ్ సిరీస్ అయితే వచ్చింది కానీ సమంత నుంచి సినిమా వచ్చి ఇప్పటికి రెండేళ్లవుతుంది. మామూలుగా ఇండస్ట్రీలో ఎవరైనా సరే రెగ్యులర్ గా ఆడియన్స్ కు కనిపిస్తుంటేనే వారికి ప్రేమాభిమానాలు దక్కుతుంటాయి. స్క్రీన్ పై కనిపించకపోతే ఆ ఎఫెక్ట్ ఎంతలేదన్నా వారి ఫాలోయింగ్ పై పడుతుందనేది నిజం.కానీ సమంత మాత్రం తనకు ఆ సమస్య లేదంటోంది. ఇండస్ట్రీలో చేసిన సినిమాలు హిట్టైతేనే వారికి క్రేజ్, ప్రేమ, అభిమానాలు పుష్కలంగా ఉంటాయి. కానీ తాను సినిమా చేసి రెండేళ్లయినా తనపై ఆడియన్స్ కు ఏ మాత్రం ప్రేమ తగ్గలేదని రీసెంట్ గా చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్ లో మాట్లాడుతూ సమంత ఎమోషనల్ అయింది.సౌత్ హీరోయిన్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన సమంత ఇప్పుడు నార్త్ లో కూడా తన సత్తా చాటుతోంది. ఇకపై వరుసపెట్టి సినిమాలు చేయడానికి రెడీ అవుతున్న సమంత ఓ వైపు నటిగా, మరోవైపు నిర్మాతగా కూడా దూసుకెళ్లాలని చూస్తోంది. ఆల్రెడీ సమంత నిర్మాతగా రూపొందిన శుభం సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు రీసెంట్ గా అనౌన్స్‌మెంట్ కూడా వచ్చింది. దీంతో పాటూ నందినీరెడ్డి దర్శకత్వంలో ఓ సినిమాకు సమంత గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటున్నారు. వీటితో పాటూ బాలీవుడ్ లో కూడా సమంత పలు ప్రాజెక్టులు చేయాలని చూస్తోంది.

మోహన్ లాల్ హీరోగా
పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఎల్-2 ఎంపురాన్

# తెలుగు వాళ్లంతా తెలుగులోనూ చూడండి!

తెరకెక్కించిన సంగతి తెలిసిందే. లూసీఫర్ భారీ విజయం సాధించిన నేపథ్యంలో రెండవ భాగం రెట్టించిన అంచనాలతో పాన్ ఇండియాలో భారీ ఎత్తున రిలీజ్ అవుతుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకు మంచి బజ్ ని తీసుకొచ్చాయి. తెలుగులో ఈ చిత్రాన్ని దిల్ రాజు రిలీజ్ చేయడం విశేషం.దీంతో తెలుగులో పెద్ద ఎత్తున రిలీజ్ అవుతుంది. ప్రస్తుతం తెలుగు సినిమాలు ఏవీ కూడా రిలీజ్ కు లేవు. ఈ నేపథ్యంలో ఎంపురాన్ పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే పెద్ద హిట్ అవుతుందనే అంచనాలున్నాయి. అయితే ఈ సినిమాను తెలుగులోనే చూడమని దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తెలుగు ఆడియన్స్ కు సూచించారు. %-%ప్రతీ తెలుగు వారు తెలుగులోనే చూడండి. సాధారణంగా ఎవరైనా ఒరిజినల్ వెర్షన్ చూడమని చెబుతారు.కానీ నేను తెలుగులో చూడమంటాను. అలా చూస్తేనే మీకు అనుభూతి దక్కుతుంది. సినిమా ఏ భాషలో చూసిన భావం అర్దమవుతుంది. కానీ ఆ ఫీల్ ఇంకా గొప్పగా దక్కాలంటే ఏ భాష వాళ్లు ఆ భాషలో చూస్తేనే అర్దమవుతుంది. తెలుగు మాట్లాడే ప్రతీ ఒక్కరు తెలుగులోనూ చూడాలని కోరుకుంటున్నా%-% అని అన్నారు. దీంతో తెలుగు భాషకు ఆయన ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నది అద్దం పడుతుంది.ఈ మధ్య కాలంలో కర్ణాటకలో తెలుగు సినిమాపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. బెంగుళూరులో తెలుగు సినిమా పోస్టర్ కనిపిస్తే చాలు చించే పాడేసేవారు. తెలుగు అక్షరాలు అక్కడ కనిపించడానికి వీలు లేదం టూ స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. ఈ రకమైన పక్షపాతం తమిళనాడులోనూ తెలుగు వాళ్లపై కనిపిస్తుంది. కానీ తెలుగు వారు మాత్రం భాషతో సంబంధం లేకుండా అందర్నీ అక్కున చేర్చుకుంటారు. అదే తరహాలో పృథ్వీరాజ్ సుకుమారన్ తాను తీసిన సినిమా మలయాళం అయినా తెలుగు వాళ్లంతా తెలుగులోనే చూడాలని కోరడం విశేషం.



%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.